Follow: @ANNTELUGU

11-02-2025

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 71 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## మహా కుంభమేళాలో పాల్గొన్న ద్రౌపదీ ముర్ము

**త్రివేణి సంగమంలో పుణ్యస్నానం చేసిన రాష్ట్రపతి**

మహా : ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమైన మహా కుంభమేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పాల్గొన్నారు. సోమవారం ఉదయం త్రివేణి సంగమం వద్ద ఆమె పుణ్యస్నానం ఆచరించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో కుంభమేళాలో భద్రత కట్టుదిట్టం చేశారు. ప్రయాగ్‌రాజ్ చేరుకున్న రాష్ట్రపతికి ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. తర్వాత వారితో కలిసి ద్రౌపదీ ముర్ము బోటులో పర్యటించారు. మార్గమధ్యంలో వలస పక్షులకు ఆమె ఆహారం అందించారు. అనంతరం త్రివేణి సంగమం వద్దకు చేరుకుని, పుణ్యస్నానం ఆచరించి, పూజలు చేశారు.

**టాప్ న్యూస్**

## తక్షణమే జనగణన చేపట్టాలి



- 14 కోట్ల మంది నష్టపోతున్నారన్న సోనియా
- రాజ్యసభ జీరో అవర్‌లో తొలిసారి మాట్లాడిన కాంగ్రెస్ అగ్రనేత


02

## కమలాదీషుడు ఎవరు ?

- అధిష్ఠానానికి తలనొప్పిగా మారిన ఎంపిక
- అధ్యక్ష రేసులో కీలక నేతలు
- రంగంలోకి దిగనున్న మోడీ, షా
- ఆశావహులను ఒప్పిస్తే తప్ప క్లియరెన్స్ కష్టం
- జోరుగా మొదలైన చర్చ

03

## స్థానిక ఎన్నికల్లో నో యునానివస్



- నోటాతో పోటీ పడాల్సిందే
- సుప్రీం కోర్టు సంచలన నిర్ణయం

03




డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్న

## నరేంద్ర మోదీ

- అమెరికాతో మినీ వాణిజ్య ఒప్పందం
- 12, 13 తేదీల్లో మోదీ అమెరికా పర్యటన

వివరాలు 3లో



GOVERNMENT OF TELANGANA
REVENUE (EXCISE-II) DEPARTMENT

Memo No.1724/Ex.II (1)/2025, Dated: 10.02.2025

Sub: TGBCL – Basic Price Revision of Domestic Beer – Orders – Issued.

Ref: 1. Price Fixation Committee Report for the year 2024-25.
2. From TGBCL, Managing Director, Hyderabad, Lr.No. TGBCL/I/2024-25, dated:20.01.2025.
3. GO Ms No:289, Revenue (Ex-II) Department,dated:30.11.2016.
4. GO Ms No:142, Revenue (Ex-II) Department,dated:30.06.2017.
5. Memo No:17327/Ex-II (1)/2022-1,dated:18.05.2022.

***

In the circumstances reported by the Managing Director, Telangana Beverages Corporation Limited, Hyderabad in the reference 2nd cited, after careful examination of the matter, Government hereby permit him to implement the Price Fixing Committee (PFC) recommendations (from a to h of the report) for the year 2024-25 on Beer basic price revision with increase in MRP of existing beer brands in line with the increase in supplier price recommended by the Price Fixing Committee vide reference 1st cited along with 'MRP rounding off' as applicable in terms of guidelines issued vide references 3rd & 4th cited duly making suitable adjustment in Additional Excise Duty (AED) as in reference 5th cited above.

2. Stocks held by IMFL depots including stock in transit be sold at revised MRP rates.

3. This order shall come in to force with effect from 11.02.2025.

4. The Commissioner, Prohibition & Excise, Hyderabad and the Managing Director, Telangana Beverages Corporation Limited, Hyderabad shall take further necessary action in the matter.

S.A.M. RIZVI
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

To,
The Commissioner, Prohibition & Excise and Managing Director, Telangana Beverages Corporation Limited, Hyderabad.
Copy to:
The Accountant General, Telangana, Hyderabad.
The PS to the Prl. Secretary to Hon'ble CM
The PS to Min (P&E)
The PS to Spcl CS (Finance).
The PS to Prl Sec (CT & Ex).

## బీర్ల ధరల పెంపు

- 15 శాతం పెంచుతూ సర్కారు నిర్ణయం
- నేటి నుంచే అమల్లోకి

వివరాలు 3లో




## నాక్ లంచం కుంభకోణం

- అనుకూల గ్రేడ్ కోసం ఏపీలోని కెఎల్ యూనివర్సిటీ నుంచి రూ.1.8 కోట్లు డిమాండ్
- పది మందిని అరెస్టు చేసిన సీబీఐ

వివరాలు 3లో



## పంజాబ్ సీఎంగా కేజ్రీవాల్..?

- పంజాబ్ మంత్రులు, ఎమ్మెల్యేలతో నేడు కీలకభేటీ
- కేజ్రీవాల్ సీఎంగా రావాలని కోరే అవకాశం

వివరాలు 4లో



# రామరాజ్యం పైశాచికం

**చిలుకూరు బాలాజీ అర్చకులు రంగరాజన్‌పై దాడి**

### ఫోన్‌లో పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ఎవరినీ ఉపేక్షించం అండగా ఉంటామని హామీ
- మీ పోలీస్ వ్యవస్థే నన్ను కాపాడుకున్నారు సీఎంతో రంగరాజన్
- రామరాజ్యం పేరుతో రౌడీయిజం క్షమించరాని నేరం మంత్రి శ్రీధర్ సీరియస్
- అర్చక వృత్తిలో ఉన్న వ్యక్తిపై దాడి అమానుషమన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- ధర్మ పరిరక్షణపై జరిగిన దాడి : పవన్ కల్యాణ్
- ప్రధాన నిందితుడు సహా ఆరుగురి అరెస్ట్

**హైదరాబాద్, మహా:** చిలుకూరి బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్ దాడి ఘటన రాజకీయ రంగు పులుముకుంటున్న దశలో ప్రభుత్వం రాజకీయపక్షాలు అప్రమత్తమయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డితో సహా పలువురు స్పందించారు. సీఎం స్వయంగా ఫోన్ చేసి రంగరాజన్‌ను పరామర్శించారు. సోమవారం సాయంత్రం రంగరాజన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. దాడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని.. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఏ సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. ఇలాంటి దాడులను సహించేది లేదని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించినట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలోనే పాదయాత్ర సమయంలో చిలుకూరు వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదం తీసుకున్నట్టు గుర్తుచేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి వీలు చూసుకుని త్వరలోనే ఆలయానికి వస్తానని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అర్చకులు రంగరాజన్‌ను పరామర్శించారు.. ఓ వైపు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్, ఎపి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా నేతలు పరామర్శించారు.

### ఖండించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

చిలుకూరి బాలాజీ ఆలయ పూజారిపై జరిగిన దాడిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఖండించారు. అర్చక వృత్తిలో ఉన్న వ్యక్తిపై దాడి అమానుషమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు స్థానం లేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ దాడిని తీవ్రంగా ఖండించాలన్నారు. బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలన్నారు.

**ప్రధాన నిందితుడు సహా ఆరుగురి అరెస్ట్**

రంగరాజన్‌పై దాడి కేసులో ఇప్పటి వరకు ఆరుగురుని అరెస్ట్ చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డి సహా మిగతా ఐదుగురుని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వీరరాఘవరెడ్డి మణికొండలో ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు.

మిగతా 2లో

# ప్రపంచంలోనే అతిపెద్ద ట్రాఫిక్ జామ్

**కుంభమేళాకు వెళ్లే దారిలో 350 కి.మీ. నిలిచిన వాహనాలు**

48 గంటలుగా ట్రాఫిక్‌లో..

50 కిలోమీటర్లు వెళ్లేందుకు దాదాపు 12 గంటల సమయం

ఆకలిదాహంతో భక్తుల అగచాట్లు



**మహా, నేషనల్ బ్యూరో:** ప్రయాగ్రాజ్కు వెళ్లే జబల్పూర్‌రేవా రహదారిపై దాదాపు 350 కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. భారతదేశ చరిత్రలో ఇంతలా రోడ్లపై వాహనాలు నిలిచిపోవడం చాలా అరుదు. ఇప్పటికి ప్రపంచంలో అతిపెద్ద ట్రాఫిక్ జామ్ చైనా పేరిట ఉంది. చైనా రాజధాని బీజింగ్లో 2010లో 100 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాదాపు 12 రోజుల పాటు ప్రజలు అప్పుడు ట్రాఫిక్లో ఇరుక్కున్నారు. ఇది గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కి కూడా ఎక్కింది. 2012లో బ్రెజిల్లోని సావోల పాలోలో 300 కిలోమీటర్లు జామ్ అయిన ట్రాఫిక్లో వాహనదారులు 1215 గంటలు చిక్కుకుపోయారు.

**చిక్కుకుపోయిన లక్షలాది మంది**

ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాకు భక్తులు పోటెత్తడం వల్ల భారీ ఎత్తున వాహనాలు రోడ్లపై నిలిచిపోయాయి.

మిగతా 2లో



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి బీఆర్‌ఎస్‌కు అభ్యర్థులే లేరు

కేటీఆర్, కవిత, హరీశ్‌రావు మధ్య 3 ముక్కలాట.. తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్

ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నా.. వారుతెచ్చింది గాడిదగుడ్డే

టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

**మహా, గజ్వేల్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే లేరని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట నడుస్తోందని అన్నారు. బీజేపీకి రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉంటే బడ్జెట్‌లో తెలంగాణకు వచ్చిన నిధులు గాడిద గుడ్డు అని ఆక్షేపించారు. ఇక్కడి బీజేపీ నేతలకు మతం పేరిట రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందడం ఆనవాయితీగా వస్తోందని విమర్శించారు.

మిగతా 2లో

# దమ్ముంటే రాజీనామా చేయ్

**మళ్ళీ గెలుస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా..**

సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

పట్నంకు 50 వేల మెజారిటీ ఖాయమన్న కేటీఆర్

**మహా :** రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డికి నిజంగా నమ్మకముంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి కొడంగల్ నుంచి రపోటీ చేసి గెలవాలని మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. కొడంగల్ లో ఉప ఎన్నిక జరిగితే 50వేల ఓట్ల మెజారిటీతో రేవంత్ రెడ్డిపై పట్నం నరేందర్ రెడ్డి గెలవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

మిగతా 2లో



## 2008 డీఎస్సీ అభ్యర్థులకు గుడ్ న్యూస్

- మూడు రోజుల్లో నియమాక ప్రక్రియ పూర్తి
- కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు చేయరా?
- విద్యాశాఖపై హైకోర్టు ఆగ్రహం
- 1,382 మందికి కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తామని వివరించిన విద్యాశాఖ కమిషనర్
- తదుపరి విచారణ ఈ నెల 17వ తేదీకి వాయిదా

03

## భద్రతా బలగాల సాహసిక విజయం

- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ప్రభావానికి తుదిమెట్టు
- ఎన్కౌంటర్లతో సంకుచితమవుతున్న నక్సలైట్ ఉనికి
- భద్రతా బలగాల వ్యూహంతో కూలిపోయిన మావోయిస్టుల కంచుకోటలు
- ప్రభుత్వ కట్టుదిట్టమైన చర్యలు
- నక్సలైట్ ఉద్యమాన్ని అణిచివేసే వ్యూహం
- అభివృద్ధితో మారనున్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల రూపురేఖలు

03

# ప్రపంచంలోనే అతిపెద్ద ట్రాఫిక్ జామ్

**కుంభమేళాకు వెళ్లే దారిలో 350 కి.మీ. నిలిచిన వాహనాలు**

48 గంటలుగా ట్రాఫిక్‌లో..
50 కిలోమీటర్లు వెళ్లేందుకు దాదాపు 12 గంటల సమయం
ఆకలిదాహంతో భక్తుల అగచాట్లు



(మొదటిపేజీ తరువాయి)
త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిద్దామని వచ్చిన లక్షలాది భక్తులు రహదారులపై చిక్కుకున్నారు. ఫలితంగా యూపీ పోలీసు యంత్రాంగం ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే మార్గాల్లో రాకపోకలను నిలిపివేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. 350 కిలోమీటర్ల మేర వాహన రాకపోకలకు అంతరాయం కలిగినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సుమారు 48 గంటలుగా ట్రాఫిక్‌లో చిక్కుకున్నామని, 50 కిలోమీటర్లు వెళ్లేందుకు దాదాపు 12 గంటల సమయం పడుతుందని ఓ వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల రద్దీని నియంత్రించలేని కారణంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రయాగ్‌రాజ్ సంగం రైల్వేస్టేషన్‌ను అధికారులు తాత్కాలికంగా మూసివేసినట్లు వదంతులు వెలువడ్డాయి. అయితే అవి అసత్య వార్తలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కొట్టిపారేశారు. ప్రయాగ్‌రాజ్‌లోని ఎనిమిది రైల్వేస్టేషన్లు సజావుగా నడుస్తున్నాయని స్పష్టం చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ల నుంచి ఆదివారం 330 రైళ్లు బయలుదేరినట్లు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే భక్తుల వాహనాల కారణంగా కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్‌జాం అయింది. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ మరో రెండు రోజులు ప్రయాగ్‌రాజ్ యాత్ర వాయిదా వేసుకోవాలని కుంభమేళాకు వెళ్లే భక్తులకు విజ్ఞప్తి చేశారు.

**ఆకలి దాహంతో భక్తుల అగచాట్లు**

ప్రయాగ్‌రాజ్‌కు దారితీసే మార్గాల్లో భారీ ట్రాఫిక్‌జామ్ నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్ సర్కార్‌పై సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాకుంభమేళా ఏర్పాట్లపై ప్రశ్నల వర్షం కురిపించారు. ట్రాఫిక్‌జాం కారణంగా రహదారులపై చిక్కుకున్న లక్షలాది మంది భక్తులు ఆకలి, దాహంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గంటగంటకు ట్రాఫిక్ రద్దీ పెరగుతుండడం వల్ల భక్తులు ఆహారం, విశ్రాంతి లేక నీరసించిపోతున్నారని పేర్కొన్నారు. సామాన్య భక్తులూ మనుషులే అనీ మానవతా దృక్పథంలో వాళ్లకీ అత్యవసర ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

**ప్లేస్ చాలక రైలు ఇంజిన్లోకి జనం**

ప్రయాగ్‌రాజ్ ప్రవేశం సమీపంలో నవాబగంజ్‌లో 30 కిలోమీటర్లు, గౌహానియాలో 16 కిలోమీటర్లు, వారణాసి మార్గంలో 12 నుంచి 15 కలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయినట్లు అఖిలేశ్ యాదవ్ తెలిపారు. విపరీతమైన రద్దీ కారణంగా రైలు ఇంజిన్‌లోకి కూడా ప్రయాణికులు ప్రవేశిస్తున్నారని, కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జాం కారణంగా జనజీవనం స్తంభించిందని మండిపడ్డారు. మహాకుంభమేళాలో ఇప్పటివరకు దాదాపు 44 కోట్ల మంది పుణ్య స్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఫ్రీ

- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- ఇసుక రవాణా, తవ్వకాల అంశంపై సీఎం కీలక నిర్ణయాలు
- ఇసుక మాఫియాపై అధికారులు ఉక్కుపాదం మోపాలి

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ఇసుక రవాణా, తవ్వకాల అంశంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గనులు ఖనిజాభివృద్ధిపై సమీక్షించిన ఆయన.. అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. "బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి పేదలకు ఇసుక అందుబాటులో ఉంచాలి. ఇసుక మాఫియాపై అధికారులు ఉక్కుపాదం మోపాలి. ఇసుక రీచ్‌ల వద్ద అధికారులు తనిఖీలు చేపట్టాలి. ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసే బాధ్యతను కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలి. హైదరాబాద్‌లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట బాధ్యతను హైడ్రాకు ఇవ్వాలి. అన్నిరీచ్‌ల వద్ద కెమెరాలు, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలి. ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్ వేయాలి. ఇసుక బుక్ చేసిన 48 గంటల్లోపు వినియోగదారుడికి అందేలా చర్యలు తీసుకోవాలి'' అని సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో సొంత స్థలాలు ఉన్నవారికి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున సాయం చేస్తున్న విషయం తెలిసిందే.

# రామరాజ్యం.. పైశాచికం

(మొదటిపేజీ తరువాయి)
వీరరాఘవరెడ్డి స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలంలోని కొప్పవరం. ఈ కేసులో అరెస్ట్ చేసిన ఆరుగురిని రిమాండ్‌కు పంపామని డీసీపీ తెలిపారు. నిందితులు ఖమ్మం, నిజామాబాద్‌కు చెందిన వారన్నారు. 2022లో వీరరాఘవరెడ్డి 'రామరాజ్యం'ను ప్రారంభించి, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతూ ప్రచారం చేస్తున్నాడు. రామరాజ్యంలో చేరితే రూ. 20వేలు జీతం ఇస్తామని చెప్పాడని డీసీపీ వివరించారు. ఏపీలోని తణుకు, కోటప్పకొండలో వీరరాఘవరెడ్డి పర్యటించి, రామరాజ్యంలో చేరిన వారిని యూనిఫామ్ కుట్టించుకోమ్మని చెప్పాడన్నారు. ఈనెల 6న అందరూ యాప్రాల్‌లో కలుసుకున్నట్లు తెలిపారు. రామరాజ్యం బ్యానర్‌తో ఫోటోలు, వీడియోలు తీసుకుని ఫోటోలు, వీడియోలతో సోషల్ మీడియాలో ప్రచారం చేశారని డీసీపీ అన్నారు. ఈ నెల 7న మూడు వాహనాల్లో చిలుకూరుకు 25 మంది నల్ల దుస్తుల్లో వచ్చారని, రామరాజ్యంలో సభ్యుల్ని చేర్పించి తమకు ఆర్థికంగా సాయం చేయాలని రంగరాజన్‌ను డిమాండ్ చేయగా, ఆయన డిమాండ్లకు అంగీకరించలేదని, అందుకే దాడి చేసినట్లు డీసీపీ తెలిపారు.

**రంగరాజన్ ఇంటికి మంత్రి సురేఖ**

సీఎం పరామర్శ నేపథ్యంలోనే రంగరాజన్ ఇంటికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెళ్లారు. స్వయంగా రంగరాజన్ ను కలిసి దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు జరుగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సమాజంలో శాంతికి విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే వారిని ప్రభుత్వం ఏ మాత్రం ఉపేక్షించోదని, దాడికి కారకులైన వారందరినీ చట్టం ముందు దోషులుగా నిలబెడుతామని మంత్రి హామీ ఇచ్చారు. దాడితో ఏ మాత్రం అధైర్య పడొద్దని, ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందన్న భరోసా కల్పించారు. హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తూ సమాజ హితం కోసం అనుక్షణం పని చేస్తున్న అర్చకుల పట్ల ఇలాంటి దాడులు సరికాదని మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఇలాంటి దాడులను సహించదని హెచ్చరించారు. రామరాజ్యం పేరుతో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు.



**ఇది క్షమించరాని నేరం- మంత్రి శ్రీధర్ బాబు సీరియస్**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి జరుగడాన్ని మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు. సోమవారం శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. రామ రాజ్యం పేరుతో దాడులు చేసే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. రామరాజ్యం పేరుతో చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు మరియు నిర్వాహకులు అయిన రంగరాజన్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇది హేయమైన చర్య అని సీరియస్ అయ్యారు. రామరాజ్యం పేరుతో రౌడీయిజం చేస్తూ అరాచకాలకు పాల్పడుతున్న వారిని ఉపేక్షించేది లేదు అని వార్నింగ్ ఇచ్చారు. రాముడి పేరును బద్నామ్ చేస్తూ అరాచక, అనాగరిక కార్యక్రమాలకు పాల్పడటం దుర్మార్గ అని అన్నారు. ఇది క్షమించరాని నేరం అని.. అంతేకాదు రాముడి భక్తుల మనోభావాలను దెబ్బ తీసే చర్యగా పేర్కొన్నారు. కొందరు ప్రజలలో ఉన్న హిందుత్వ భావాన్ని ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్నారు.. ఇలాంటి వారి పట్ల పోలీసులు, ప్రజలు, రాజకీయ పార్టీలు అందరూ అప్రమతంగా ఉండాలని సూచించారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలు, అరాచక శక్తుల పట్ల ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ధర్మాన్ని కాపాడుతూ సమాజ హితం కోసం నిస్వార్థంగా పని చేస్తున్న అర్చకుల పట్ల ఇలాంటి దాడులు అమానుషం అని అన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, రంగరాజన్‌పై దాడి కేసుకు సంబంధించి ఆదివారం ఒకరిని అరెస్టు చేసినట్టు మొయినాబాద్ పోలీసులు తెలిపారు. మొత్తం 20 మంది దాడి చేసినట్లు ఆరోపణలు రాగా.. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పారు.

**ధర్మ పరిరక్షణపై జరిగిన దాడి : పవన్ కల్యాణ్**

అర్చకులు రంగరాజన్‌పై దాడి జరిగిందని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనైనట్లు తెలిపారు. ఈ ఘటనను దురదృష్టకరమన్న పవన్ ఈ చర్యను ఖండించారు. ఈ దాడిని ఒక వ్యక్తిపై జరిగింది కాకుండా ధర్మ పరిరక్షణపై జరిగిన దాడిగా భావించాలన్నారు.

**వీడియోలున్నా ప్రభుత్వం ఏం చేస్తోంది? : కేటీఆర్ ఫైర్**

ఈ దాడిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. దాడి జరిగి రెండ్రోజులవుతన్నా ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. వీడియోలున్నా.. ప్రభుత్వం స్పందించటం లేదన్నారు. హిందూ ధర్మ పరిరక్షకులు కూడా నోరు మెదపకపోవటం శోచనీయమన్నారు. చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడు, గొప్ప పండితుడు రంగరాజన్ గారిపై రెండు రోజుల క్రితం ముష్కరులు దాడి చేశారు. ఈ పిరికిపంద చర్యపై హిందూ మత పరిరక్షకుల నుంచి ఒక్క మాట కూడా లేదు. దాడికి సంబంధించిన వీడియోలు ఉన్నాయి. రెండు రోజుల్లో తెలంగాణ ప్రభుత్వం ఏమైనా చేసిందా? హోం మంత్రి.. ముఖ్యమంత్రి ఎక్కడా..? అని ప్రశ్నించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్‌కు అభ్యర్థులే లేరు

కేటీఆర్, కవిత, హరీశ్‌రావు మధ్య 3 ముక్కలాట.. తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్
ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నా.. వారుతెచ్చింది గాడిదగుడ్డే
టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)
పార్లమెంట్ ఎన్నికల మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరోక్షంగా బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి మద్దతిస్తోందని ఆరోపించారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ దోస్తీ**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీజేపీ రెండు పార్టీలు దోస్తీ చేస్తున్నాయని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఫాం హౌస్‌కే పరిమితమైన మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకని ప్రశ్నించారు. గజ్వేల్ ప్రజలను పట్టించుకోకుండా ఫాంహౌస్‌లో కేసీఆర్ సేద తీరుతున్నారని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ రిమ్మన్నగూడ ఎస్ 4 వద్ద మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించడానికి బీఆర్ఎస్ బీజేపీ లోపాయికారి ఒప్పందంతో ఎన్నికలకు వస్తున్నాయని ఆయన ఆరోపించారు.

**బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలున్నా..**

తెలంగాణలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉంటే బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చిన నిధులు గాడిద గుడ్డు అని ఆక్షేపించారు. ఇక్కడి బీజేపీ నేతలకు మతం పేరిట రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందండం ఆనవాయితీగా వస్తోందని ఆరోపించారు. స్వాతంత్ర్యం తర్వాత దేశంలో మొట్ట మొదటిగా తెలంగాణలో కులగణన సర్వే నిర్వహించడం చరిత్రాత్మకమని అన్నారు. పారదర్శకంగా కులగణన సర్వే నిర్వహించామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.



**బీసీల గురించి బీఆర్ఎస్ మాట్లాడటమా?**

మాజీ మంత్రి కేటీఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌లో కేటీఆర్ కవిత హరీష్ మధ్య మూడు ముక్కలాట నడుస్తోందని విమర్శలు చేశారు. బీసీల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. కులగణన సర్వేలో పాల్గొనని కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రీ సర్వే జరపమని అడిగే అర్హత లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. నిరుద్యోగ నిర్మూలన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తోందన్నారు. మాటకు కట్టుబడి ఇచ్చిన హామీలను నెరవేర్చామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చొరవతో రికార్డు స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# దమ్ముంటే రాజీనామా చేయ్

**మళ్ళీ గెలుస్తే రాజకీయ సన్యాయం తీసుకుంటా..**

సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్
పట్నంకు 50 వేల మెజారిటీ ఖాయమన్న కేటీఆర్





(మొదటిపేజీ తరువాయి)
ఒక వేళ నరేందర్ రెడ్డి గెలవకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ హాట్ కామెంట్స్ చేశారు. కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో నిర్వహించిన రైతు దీక్షలో మాట్లాడిన కేసీఆర్ నేను నిజంగా రైతు నిరసన దీక్షకి వచ్చానా లేక కొడంగల్ లో ఉపఎన్నిక వచ్చి రేవంత్ రెడ్డి ఓడిపోయి పట్నం నరేందర్ రెడ్డి గెలిచాక చేసే విజయోత్సవ ర్యాలీకి వచ్చానా అన్నట్టుగా ఉందన్నారు. రేవంత్ రెడ్డి మీకు ఒక బంపర్ ఆఫర్ ఇస్తున్నా. మీరు అంటున్నారు కదా.. నేను కులగణన చేశా, బీసీలందరూ సంతోషంగా ఉన్నారు, రైతు బంధు వేశా రైతులంతా సంతోషంగా ఉన్నారు, రైతు కూలీలకు పైసలు వేశా వాళ్లు సంతోషంగా ఉన్నారు, ఇళ్ల కాగితాలు ఇచ్చా పేదలంతా సంతోషంగా ఉన్నారని మీరు అంటున్నారు కదా.. దమ్ముంటే రేవంత్ రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ ఇక్కడికి రండి. ఎవరు గెలుస్తారో చూద్దామన్నారు. మీకు మాట ఇస్తున్నాం, ప్రచారానికి మేము ఇంతమందిమి రాము, పట్నం నరేందర్ రెడ్డి నామినేషన్ వేసి ఇంట్లో కూర్చుంటాడు, బయటకు కూడా రాడు, మేము జిల్లా నాయకులం కొంతమంది తిరుగుతాం, ఉప ఎన్నిక జరిగితే మేము గెలవడం కాదు 50వేల మెజార్టీకి ఒక్క ఓటు తక్కువ వచ్చినా నేను రాజకీయ సన్యాసం చేస్తా, రాజకీయంలో కూడా ఉండను అని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి అన్నా, ప్రభుత్వం అన్నా ఎవరూ భయపడటం లేదని, ఇది వాస్తవమన్నారు. ఒక్క కొడంగల్ లోనే కాదు. రాష్ట్రం మొత్తంలో వాస్తవ ముఖచిత్రం ఇది. 420 హామీలు ఇచ్చి మళ్లీ మోసం చేస్తానంటే కుదరదు. ఇవాళ రైతులు అడుగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గర్జిస్తున్నారు. ముఖ్యమంత్రి అన్న భయం లేదు, ప్రభుత్వం అన్న భయం లేదు. జనాలు ఘోరంగా తిడుతున్నారంటూ రేవంత్ సర్కార్ పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఏడాది కాలంగా కొడంగల్ లో కురుక్షేత్రం మాదిరిగా యుద్ధం నడుస్తోందని, మా ప్రాంతపు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి అయితే మా ప్రాంతం బాగు పడుతుందని మీరంతా ఓట్లు వేసి గెలిపించుకుంటే ఈ 14 నెలల్లో రేవంత్ రెడ్డి ఎవరి కోసం పని చేస్తున్నారో ఒక్కసారి ఆలోచన చేయండని సభికులను ఉద్దేశించి కేటీఆర్ అన్నారు. 14 నెలల పరిపాలనలో ఒక్క పని రైతుల కోసం, మహిళల కోసం, పెద్ద మనుషుల కోసం, యువత కోసం పని చేసింది లేదని మండిపడ్డారు. అనుముల అన్నదమ్ముల కోసం, ఆయన అల్లుడి కోసం, అదానీ కోసం, బావమరుదుల కోసం, ఆయన కుటుంబసభ్యులకు వేల కోట్లు దోచుకోవడానికి, ఇక్కడి భూములు గుంజుకోవడానికి మాత్రం బ్రహ్మాండంగా పని చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# తక్షణమే జనగణన చేపట్టాలి

**14 కోట్ల మంది నష్టపోతున్నారన్న సోనియాగాంధీ**

రాజ్యసభ జీరో అవర్‌లో తొలిసారి మాట్లాడిన కాంగ్రెస్ అగ్రనేత



**మహా :** వీలైనంత త్వరగా జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ డిమాండ్ చేశారు. జనగణన జరగకపోవడం వల్ల దేశంలో దాదాపు 14 కోట్ల మంది ప్రజలు జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రయోజనాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాజ్యసభలో జీరో అవర్‌లో సోనియా గాంధీ తొలిసారి మాట్లాడారు. "2011 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవడం వల్ల 14 కోట్ల మంది లబ్ధిదారులు జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రయోజనాలను కోల్పోతున్నారు. 140 కోట్ల మందికి ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో 2013 సెప్టెంబరులో యూపీఏ హయాంలో జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని తీసుకొచ్చాం. కొవిడ్ సంక్షోభ సమయంలో లక్షలాది పేద కుటుంబాలను ఆకలి నుంచి రక్షించడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషించింది. ఇప్పటికీ 2011 జనాభా లెక్కల ఆధారంగానే లబ్ధిదారుల కోటాను నిర్ణయిస్తున్నారు" అంటూ సోనియా గాంధీ పేర్కొన్నారు.

**దేశ చరిత్రలో ఇదే తొలిసారి : సోనియా**

స్వతంత్ర భారత దేశ చరిత్రలో మొదటిసారి పదేళ్లకు ఒకసారి చేపట్టే జనగణన నాలుగేళ్లు ఆలస్యం అయ్యిందని సోనియా గాంధీ తెలిపారు. "2021కల్లా జనగణన చేపట్టాల్సి ఉంది. కానీ ఇప్పటికీ జనగణన ఎప్పుడు జరుగుతుందో స్పష్టత లేదు. బడ్జెట్ కేటాయింపులు చూస్తే ఈ ఏడాది కూడా జనగణన జరగదని అర్థమవుతోంది. జనగణన జరగకపోవడం వల్ల 14 కోట్ల మంది అర్హతగల భారతీయులు జాతీయ ఆహార భద్రతా చట్టం కింద వారికి లభించాల్సిన ప్రయోజనాలను కోల్పోతున్నారు. జనగణనను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. అర్హులైన వారందరికీ జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ప్రయోజనాలు అందేలా చూడాలి. ఆహార భద్రత ఒక ప్రత్యేక హక్కు కాదు. ఇది ప్రాథమిక హక్కు" అని సోనియా గాంధీ వ్యాఖ్యానించారు. జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని 2013లో యూపీఏ సర్కార్ తీసుకొచ్చింది. ఈ చట్టం కింద గ్రామీణ ప్రాంత ప్రజలకు 75 శాతం, పట్టణ ప్రజలకు 50 శాతం వరకు సబ్సిడీతో ఆహార ధాన్యాలను అందించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం లబ్ధిదారులను దాదాపు 81.35 కోట్లుగా అంచనా వేసింది. ప్రస్తుతం ఆహార భద్రతా చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రతి వ్యక్తికి నెలకు 5 కిలోల ఆహార ధాన్యాలను ఉచితంగా అందిస్తోంది. జన గణన చేయకపోవడంతో పేదరికానికి దిగువన ఉన్న చాలా మంది ఉచిత ఆహార ధాన్యాలను పొందలేకపోతున్నారన్న విమర్శలు గత కొంత కాలంగా తరచూ వినిపిస్తున్నాయి.

# ముగిసిన నామినేషన్ల గడువు

**పట్టభద్రుల ఎమ్మెల్సీకి 60 నామినేషన్లు.. టీచర్ ఎమ్మెల్సీకి 85 నామినేషన్లు 1**

**మహా :** ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్లు వెల్లువెత్తాయి. గడువు సమయం ముగిసే వరకు 60కి పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. దాఖలైన నామినేషన్లను మంగళవారం పరిశీలించనున్నారు. నామినేషన్లు ఉపసంహరించుకోనే గడువు 13వ తేదీతో ముగియనుంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఈ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3వ తేదీన ఎన్నికల ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను మార్చి 8వ తేదీలోగా పూర్తి చేస్తారు. కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ, నల్లగొండ ఖమ్మం వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీకీ మొత్తం 85 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటి వరకు 17 మంది 23 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. పీఆర్‌టీయూ బలపర్చిన అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డితో పాటు బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, టీజేఏసీ అభ్యర్థిగా హర్షవర్ధన్ రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ నామినేషన్‌ను వేశారు. అయితే ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ దూరంగా ఉండడం గమనార్హం. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మొత్తం మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది మార్చి 29వ తేదీన ఈ మూడు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నిలకు అనివార్యమయ్యాయి. నామినేషన్ల దాఖలుకు అధికార కాంగ్రెస్, బీజేపీలు భారీ ర్యాలీలతో దాఖలు చేయడంతో కరీంనగర్ పట్టణంలో గడచిన మూడు రోజులుగా సందడి వాతావరణం నెలకొంది.

# భద్రతా బలగాల సాహసిక విజయం

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ప్రభావానికి తుదిమెట్టు

- ఎన్కౌంటర్లతో సంకుచితమవుతున్న నక్సలైట్ ఉనికి
- భద్రతా బలగాల వ్యూహంతో కూలిపోయిన మావోయిస్టుల కంచుకోటలు
- ప్రభుత్వ కట్టుదిట్టమైన చర్యలు.. నక్సలైట్ ఉద్యమాన్ని అణిచివేసే వ్యూహం
- అభివృద్ధితో మారనున్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల రూపురేఖలు



**ఖమ్మం మహా:** దేశంలో నక్సలైట్ ఉద్యమం పాతుకుపోయిన ఒక ప్రధాన భద్రతా సమస్యగా కొనసాగింది. భూసంస్కరణల పేరుతో ప్రారంభమైన ఈ ఉద్యమం కాలక్రమంలో తీవ్రమైన సాయుధ పోరాటంగా మారింది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రభావం తీవ్రంగా కనిపించింది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, అభివృద్ధికి అడ్డుగోడగా మారిన నక్సలైట్ ఉద్యమాన్ని అణిచివేయడానికి భద్రతా బలగాలు సమర్థవంతమైన వ్యూహాలను అమలు చేస్తున్నాయి. గడచిన కొన్నేళ్లుగా నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాల కూంబింగ్ ఆపరేషన్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, సుక్మా, దంతేవాడ, నారాయణ్‌పూర్ వంటి ప్రాంతాల్లో జరిగిన భారీ ఎన్కౌంటర్లు మావోయిస్టుల ఉనికికి తీవ్ర ఎదురుదెబ్బగా మారాయి. నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాల సమర్థవంతమైన వ్యూహాలు. నక్సలైట్ ఉద్యమం గడచిన దశాబ్దాలుగా అభివృద్ధికి అడ్డుకట్టగా మారింది. భద్రతా బలగాలు అనుసరించిన వ్యూహాత్మక చర్యల ఫలితంగా గత రెండేళ్లుగా ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్ ఉనికి క్షీణిస్తోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం కొనసాగిస్తున్న నక్సలైట్ గ్రూపులను పూర్తిగా అణచివేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నాయి. భద్రతా బలగాల ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ సమాధాన్, ఆపరేషన్ మోన్సూన్ వంటి కీలక వ్యూహాలతో ప్రభుత్వం నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో తనపట్టు బిగించింది.

**ఎన్కౌంటర్ల ధాటికి నక్సలైట్ ప్రాబల్యానికి తీవ్ర ఎదురుదెబ్బ.**

2024 జనవరి 6న బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 19 మంది మావోయిస్టులు హతమయ్యారు. అదే నెల 17న బీజాపూర్ జిల్లాలో మరో ఎన్‌కౌంటర్‌లో 17 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. జనవరి 21న ఒడిశా సరిహద్దులోని అటవీ ప్రాంతంలో 20 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు హతమార్చాయి. నవంబర్ 16న సుక్మా జిల్లాలో మరో పెద్ద ఎన్‌కౌంటర్ జరిగింది, ఇందులో 10 మంది మావోయిస్టులు మరణించారు. 2025లోనూ ఇదే ఉధృతి కొనసాగింది. జనవరి 17న బీజాపూర్‌లో 17 మంది మావోయిస్టులు, జనవరి 18న ఛత్తీస్‌గఢ్‌లో 10 మంది మావోయిస్టులు మరణించారు. జనవరి 21న ఒడిశా సరిహద్దులో మరో 20 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు తుదముట్టించాయి. ఫిబ్రవరి 9న బీజాపూర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 31 మంది మావోయిస్టులు మరణించారు.

**భద్రతా బలగాల మారుఛేయబడిన వ్యూహం – నక్సలైట్ కంచుకోటల చెరిపివేత.**

భద్రతా బలగాలు ఇప్పటివరకు సాధించిన విజయాల్లో అత్యంత కీలకమైనది మారుమూల అటవీ ప్రాంతాల్లో నక్సలైట్ నేతలను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన ఆపరేషన్లే. ఇప్పటి వరకు మావోయిస్టుల ఆధిపత్యం కొనసాగిన సుక్మా, బీజాపూర్, దంతేవాడ జిల్లాల్లో భద్రతా బలగాలు అధిక సంఖ్యలో మోహరించాయి. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, మారుమూల గ్రామాల్లో రహదారులు, విద్యుత్, దారిద్ర్య నిర్మూలన పథకాలు అమలు చేయడం ద్వారా మావోయిస్టుల ఆదరణ తగ్గించడానికి చర్యలు చేపట్టింది.

**మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి – మారుతున్న పరిస్థితులు.**

భద్రతా బలగాల విజయాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. గ్రామాలకు రహదారులు, విద్యుత్ సరఫరా, తాగునీటి పథకాలు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలను ప్రభుత్వ వైపునకు తిప్పే ప్రయత్నం చేస్తోంది. నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి కల్పన వంటి అంశాలను మెరుగుపరిచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాయి.

**మావోయిస్టుల గతి – భవిష్యత్‌లో ఏమవుతుంది?**

భద్రతా బలగాల ఉధృత చర్యలతో మావోయిస్టుల ఉనికి పూర్తిగా క్షీణిస్తోంది. ఇటీవల జరిగిన ఎన్కౌంటర్లు మావోయిస్టు ఉద్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా సాగుతున్నాయి. భద్రతా బలగాల వ్యూహాత్మక దాడులతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను మారుస్తున్నాయి. భవిష్యత్‌లో మావోయిస్టుల ఉనికి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే అవకాశముంది.

**ప్రభుత్వ అభివృద్ధి చర్యలు**

భద్రతా బలగాల సాయంతో నక్సలైట్ ప్రభావిత ప్రాంతాలను శాంతి పథంలోకి తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృత స్థాయిలో అభివృద్ధి చర్యలు చేపట్టాయి. ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ కార్యక్రమాలు ప్రజలకు లబ్ధి చేకూర్చడం ద్వారా మావోయిస్టుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాయి.

**మౌలిక వసతుల అభివృద్ధి**

నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారింది. తాగునీరు, విద్యుత్, టెలికమ్యూనికేషన్ సేవలను అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాయి. ప్రధానంగా ప్రధాన్ మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద మారుమూల గ్రామాలకు రహదారులను నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించింది. భారత్‌నెట్ ప్రాజెక్ట్ ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు చర్యలు చేపట్టాయి. జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

**విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు – నవీన పాఠశాలలు, హాస్టళ్ల ఏర్పాటు**

నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. గ్రామీణ విద్యాభివృద్ధి కోసం కొత్త పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశాయి. ముఖ్యంగా ఎకల్ విద్యాలయ ప్రోగ్రామ్ ద్వారా మారుమూల గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయగా, ఆదివాసీ పిల్లల కోసం ఆశ్రమ పాఠశాలలను నిర్మించింది. సర్వ శిక్షా అభియాన్ కింద ప్రతి బాలబాలిక విద్యను పొందేలా చర్యలు తీసుకుంది.

**ఆరోగ్య సేవల్లో విస్తరణ – గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం**

నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఆయుష్మాన్ భారత్ - ఆరోగ్య మిత్ర పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా కవరేజీ అందించేందుకు చర్యలు తీసుకుంది. సబ్ సెంటర్ ఆరోగ్య కేంద్రాలను ప్రతి మండలానికి అందుబాటులోకి తీసుకువచ్చింది. మిషన్ ఇంద్రధనుష్ ద్వారా గిరిజన ప్రజలకు టీకాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది.

**ఉపాధి కల్పన – ఆదివాసీ గ్రామాల ఆర్థిక పురోగతి**

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచేందుకు వివిధ పథకాలను ప్రభుత్వం తీసుకువచ్చింది. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రజలకు సంవత్సరానికి 100 రోజులు ఉపాధి కల్పించే చర్యలు తీసుకుంది. స్టార్ట్ అప్ ఇండియా - ముద్రా యోజన కింద ఆదివాసీ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రుణ సదుపాయాలను అందిస్తోంది. ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీస్ ద్వారా గ్రామీణ రైతులకు సహకార వ్యవస్థ ద్వారా వ్యవసాయ మార్కెట్ లింకేజెస్ కల్పిస్తోంది.


**సమగ్ర అభివృద్ధి – భవిష్యత్తు ప్రణాళికలు**

ప్రభుత్వం చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమాల వల్ల నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతి స్థిరపడుతోంది. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్పన ద్వారా ప్రజలు మావోయిస్టుల ప్రభావం నుండి బయటపడుతున్నారు. భవిష్యత్తులో మరింత శాంతి నెలకొనడానికి, అభివృద్ధి వేగంగా జరగడానికి ప్రభుత్వ ప్రణాళికలు కీలకంగా మారనున్నాయి.

# బీర్ల ధరల పెంపు

- 15 శాతం పెంచుతూ సర్కారు నిర్ణయం
- నేటి నుంచే అమల్లోకి

**హైదరాబాద్, మహా:** బీర్ల సరఫరాదారులకు 15 శాతం ధరల పెంపును రిటైర్డ్ జడ్జీ జైస్వాల్ నేతృత్వంలో ని ధరల నిర్ణయ కమిటీ సిఫారసు చేసింది. కమిటీ సిఫారసు మేరకు సరఫరాదారులకు 15 శాతం ధర పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ధరల సవరణ తో ప్రస్తుతం ఉన్న బీర్ల ఎమ్మార్పీ 15 శాతం పెరగనుంది. పెరిగిన ధరలు మంగళవారం నుండే అమలు కానున్నాయి.



GOVERNMENT OF TELANGANA
REVENUE (EXCISE-II) DEPARTMENT

Memo No.1724/Ex.II (1)/2025, Dated: 10.02.2025

Sub: TGBCL – Basic Price Revision of Domestic Beer – Orders – Issued.

Ref: 1. Price Fixation Committee Report for the year 2024-25.
2. From TGBCL, Managing Director, Hyderabad, Lr.No. TGBCL/I/2024-25, dated 20.01.2025.
3. GO Ms No:289, Revenue (Ex-II) Department,dated:30.11.2016.
4. GO Ms No:142, Revenue (Ex-II) Department,dated:30.06.2017.
5. Memo No:17327/Ex-II (1)/2022-1,dated:18.05.2022.

***

In the circumstances reported by the Managing Director, Telangana Beverages Corporation Limited, Hyderabad in the reference 2nd cited, after careful examination of the matter, Government hereby permit him to implement the Price Fixing Committee (PFC) recommendations (from a to h of the report) for the year 2024-25 on Beer basic price revision with increase in MRP of existing beer brands in line with the increase in supplier price recommended by the Price Fixing Committee vide reference 1st cited along with 'MRP rounding off' as applicable in terms of guidelines issued vide references 3rd & 4th cited duly making suitable adjustment in Additional Excise Duty (AED) as in reference 5th cited above.

2. Stocks held by IMFL depots including stock in transit be sold at revised MRP rates.
3. This order shall come in to force with effect from 11.02.2025.
4. The Commissioner, Prohibition & Excise, Hyderabad and the Managing Director, Telangana Beverages Corporation Limited, Hyderabad shall take further necessary action in the matter.

S.A.M. RIZVI
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

To,
The Commissioner, Prohibition & Excise and Managing Director,
Telangana Beverages Corporation Limited, Hyderabad.
Copy to:
The Accountant General, Telangana, Hyderabad.
The PS to the Prl. Secretary to Hon'ble CM
The PS to Min (P&E)
The PS to Spcl CS (Finance).
The PS to Prl Sec (CT & Ex).

# నాక్ లంచం కుంభకోణం

- అనుకూల గ్రేడ్ కోసం ఏపీలోని కెఎల్ యూనివర్సిటీ నుంచి రూ.1.8 కోట్లు డిమాండ్
- పది మందిని అరెస్టు చేసిన సీబీఐ




**మహా:** ఉన్నత విద్యా వ్యవస్థలో జరిగిన భారీ అవినీతి బయటపడింది. ఉన్నత విద్యా సంస్థలకు ఇచ్చే నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) అనుకూల గ్రేడ్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేయడం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే డబ్బులు తీసుకుని నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వంటి ఘటనలు మరవక ముందే మళ్లీ నాక్ గ్రేడ్ కోసం కోట్ల రూపాయాల డబ్బులను డిమాండ్ చేయడం బయటపడింది. జనవరి 26న దేశ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్న సమయంలో జేఎన్‌యూ ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా ఒక ప్రయివేట్ యూనివర్సిటీకి నాక్ తనిఖీ నివేదికను తారుమారు చేయడానికి క్యాంపస్‌లోని తన నివాసంలో లంచం కోసం చర్చలు జరిపారు. అనుకూలమైన అక్రిడిటేషన్ గ్రేడ్ ఇవ్వడానికి నాక్ బృందం సభ్యులు ఆంధ్రప్రదేశ్‌లోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (కేఎల్‌ఈఎఫ్) నుంచి రూ.1.8 కోట్లు డిమాండ్ చేశారు. చర్చల తర్వాత, రూ.28 లక్షలకు ఒప్పందం ముగిసింది. ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా ప్రధాన వాటాను సొంతం చేసుకున్నారు. సీబీఐ.. సోదాలు నిర్వహించి కేసు నమోదు చేసింది. ప్రొఫెసర్ సిజారియాతో సహా మొత్తం పది మందిని దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. ఈ నెల ప్రారంభంలో నాక్ కమిటీ చైర్మెన్, రామచంద్ర చంద్రవంశీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సమేంద్ర నాథ్ సాహా, నాక్ సభ్యులు రాజీవ్ సిజారియా, భారత్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లా డీన్ డి. గోపాల్, జాగ్రన్ లేక్‌సిటీ విశ్వవిద్యాలయం డీన్ రాజేష్ సింగ్ పవార్, జిఎల్ బజాజ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ మానస్ కుమార్ మిశ్రా, దావణగెరె విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గాయత్రి దేవరాజా, సంబల్‌పూర్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ బులు మహారాణా, కెఎల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ జిపి సారధి వర్మ, మరో ఇద్దరు ఆఫీస్ బేరర్లతో సహా మొత్తం పది మందిని సీబీఐ అరెస్టు చేసింది.

# 2008 డీఎస్సీ అభ్యర్థులకు గుడ్ న్యూస్

## మూడు రోజుల్లో నియమాక ప్రక్రియ పూర్తి

కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు చేయరా?.. విద్యాశాఖపై హైకోర్టు ఆగ్రహం
1,382 మందికి కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తామని వివరించిన విద్యాశాఖ కమిషనర్
తదుపరి విచారణ ఈ నెల 17వ తేదీకి వాయిదా

**హైదరాబాద్, మహా:** కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అమలు చేయరా అంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నరసింహారెడ్డిపై హైకోర్టు ఆగ్రహం ప్రదర్శించింది. డీఎస్సీ 2008 అభ్యర్థులు ఏళ్ల తరబడి నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని, కనీసం కోర్టు ఉత్తర్వులను అయినా గౌరవించాలని సూచించింది. మీరు మనుషులేనని, చిన్నచిన్న తప్పులు జరుగుతుంటాయని, వాటిని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ఉందంది. కోర్టు దిక్కరణ కింద మీకు వ్యతిరేకంగా ఏదైనా వ్యాఖ్య రాస్తే ఉన్నత పదవుల్లో ఉన్న మీ భవిష్యత్తుకు ఇబ్బంది ఉంటుందని వ్యాఖ్యానించింది. 2008 డీఎస్సీకి సంబంధించి 1382 పోస్టుల భర్తీ వ్యవహారంపై జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ తిరుమల దేవిలతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ డీఎస్సీ 2008కి సంబంధించి 1,382 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయడానికి ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకున్నామని, నియామకం చేపడతామనగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని, అలా కాని పక్షంలో అధికారులు హాజరుకావాల్సి ఉంటుందని ఉత్తర్వులు ఇచ్చామని గుర్తు చేసింది. ఉత్తర్వులు అమలు చేయనపుడు ఉన్నతాధికారులు ఎందుకు హాజరుకాలేదని నిలదీసింది. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరించింది. కాస్త సమయం ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో హైకోర్టు అనుమతించింది.

**మూడురోజుల్లో నియామక ప్రక్రియ**

మధ్యాహ్నం తర్వాత పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నరసింహా రెడ్డి హాజరై ఎన్నికల కమిషన్ అనుమతి మంజూరు చేసిందని, నియామక ప్రక్రియ చేపట్టామని తెలిపారు. మూడు రోజుల్లో నియమాక ప్రక్రియ పూర్తి చేస్తామనగా ధర్మాసనం స్పందిస్తూ కోర్టు ఉత్తర్వులను గౌరవించాలంది. ఏవేవో కారణాలతో నియమాకాలు



జరగకపోవడంతో ఏళ్ల తరబడి వాళ్లు ఎదురుచూస్తున్నారంటూ ఉత్తర్వుల అమలు కోసం తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది.


**17 ఏళ్ళ తర్వాత..**

30 వేల ఎస్జీటీ పోస్టుల భర్తీకి 2008 డీఎస్సీ నోటిఫికేషన్ జారీ అయ్యాక డీఎడ్ అభ్యర్థులకు 30 శాతం రిజర్వేషన్ కల్పించడంతో వివాదం మొదలైంది. 2008లో నోటిఫికేషన్లో డీఎడ్ అభ్యర్థులతో భర్తీ కాగా మిగిలిన 2367 పోస్టులను అర్హత సాధించిన బీఎడ్ అభ్యర్థులను ఏపీలో వలె కాంట్రాక్ట్ పద్ధతిన నియమించాలని హైకోర్టు గత ఏడాది ఫిబ్రవరిలో ఆదేశాలు జారీ చేసింది. 2367 మందికిగాను 1382 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలకు ఆసక్తి చూపారని, ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి రావడంతో నియామకాలకు కొంత గడువు కావాలంటూ హైకోర్టును ప్రభుత్వం గడువు కోరింది. ఎన్నికల నియమావళి కోర్టు ఉత్తర్వుల అమలుకు అడ్డంకి కాదని వాటిని అమలు చేయాల్సిందేనంటూ గత వారం తేల్చి చెప్పడంతో విచారణకు హాజరైన విద్యాశాఖ కమిషనర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు వివరణ ఇచ్చారు.

# డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్న నరేంద్ర మోదీ

## అమెరికాతో మినీ వాణిజ్య ఒప్పందం

12, 13 తేదీల్లో మోదీ అమెరికా పర్యటన



**ఢిల్లీ, మహా:** ప్రపంచ దిగ్గజాల కీలక భేటీకి రంగం సిద్ధమైంది. ఇతర దేశాల ఉత్పత్తులపై ఎడాపెడా పన్నులు విధిస్తూ వాణిజ్య యుద్ధానికి తెరలేపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించనున్నారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సుంకాల రాయితీ, అక్రమ వలసదారులు తదితర అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్‌అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం తలెత్తకుండా ట్రంప్ పగ్గాలు చేపట్టిన కొన్ని రోజుల్లోనే మోదీ అమెరికాలో పర్యటించనున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. ట్రంప్, మోదీ సమావేశంలో వాణిజ్యంతో పాటు రక్షణ, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారంపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన భారతీయులను వెనక్కి పంపించే ప్రక్రియ జరుగుతుండగా ఆ అంశంపై కూడా ఈ భేటీలో చర్చ జరగవచ్చు. భారత్ అధిక సుంకాలు విధిస్తోంది అంటూ ట్రంప్ విమర్శించినా ప్రధాని మోదీని మాత్రం అద్భుత వ్యక్తిగా కొనియాడారు. భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 202324లో ఇరుదేశాల మధ్య 118 బిలియన్ డాలర్ల విలువైన వాణిజ్యం జరిగింది. ఇందులో భారత్‌కు అమెరికా దిగుమతుల కంటే అమెరికాకు భారత్ ఎగుమతులే 32 బిలియన్ డాలర్లు ఎక్కువగా ఉన్నాయి. గత దశాబ్ద కాలంగా భారత్‌అమెరికా మధ్య వాణిజ్య బంధం బలపడుతూ వచ్చింది. బీజింగ్‌కు చెక్ పెట్టేందుకు న్యూఢిల్లీపై అమెరికా అనుకూల వైఖరి ప్రదర్శించడం కూడా అందుకు ప్రధాన కారణం. అమెరికాతో మినీ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది.

**భారత్‌ను టారిఫ్ కింగ్‌గా పేర్కొన్న ట్రంప్**

అమెరికా ఉత్పత్తులపై భారత్ అధిక సుంకాలు విధిస్తోంది అంటూ గతంలో ట్రంప్ అనేక సార్లు ఆరోపణలు చేశారు. భారత్‌ను టారిఫ్ కింగ్‌గా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడితో సమావేశానికి ముందు భారత్‌కు అమెరికా ఎగుమతులు పెరిగేలా కొన్ని సుంకాలను మోదీ తగ్గించవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తద్వారా భారత ఎగుమతులపై అమెరికా అదనపు సుంకాలు విధించకుండా నిలువరించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి పగ్గాలు చేపట్టిన తర్వాత ఇతర దేశాల ఉత్పత్తులపై సుంకాలు విధించే విషయంలో డొనాల్డ్ ట్రంప్ దూకుడు మీద ఉన్నారు. ఇప్పటికే చైనాపై 10 శాతం సుంకాలు విధించిన ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. తాజాగా అమెరికాకు దిగుమతి అయ్యే స్టీల్, అల్యూమినియంపై 25 శాతం అదనపు సుంకాలు విధించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే 12, 13 తేదీల్లో మోదీ అమెరికా పర్యటన కీలకంగా మారింది. ఇక ఫ్రాన్స్‌లో నిర్వహించనున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సదస్సుకు మోదీ సహఅధ్యక్షత వహించనున్నారు. ఇందుకోసం సోమవారం ఆయన ఢిల్లీ నుంచి పారిస్ బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమం ముగిశాక అమెరికా పర్యటనకు వెళ్తారు.

# కమలాధీషుడు ఎవరు?

- అధిష్టానానికి తలనొప్పిగా మారిన ఎంపిక
- అధ్యక్ష రేసులో కీలక నేతలు
- రంగంలోకి దిగనున్న మోడీ, షా
- ఆషావహులను ఒప్పిస్తే తప్ప క్లియరెన్స్ కష్టం
- జోరుగా మొదలైన చర్చ



**మహా :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక అధిష్టానానికి తలనొప్పిగా మారింది. దీంతో ఇప్పట్లో అధ్యక్ష ఎన్నిక లేకపోవచ్చన్న ప్రచారం పార్టీలో జోరందుకుంది. అధ్యక్ష రేసులో పలువురు కీలక నేతలు ఉన్నారు. ఈ కీలక నేతలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో ఎవరికి పదవి ఇస్తే ఎవరికి కోపం వస్తుందో అన్న ఉద్దేశ్యంతో అధిష్టానం ఆచీ తూచీ నిర్ణయం తీసుకోవాలన్న భావనకు వచ్చినట్లు పార్టీలో చర్చ మొదలైంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో నేతలు వ్యవహరించిన తీరుపై ఒకరిపై ఒకరు అధిష్టానం వద్ద ఫిర్యాదులు చేసుకుంటున్నారు. దీంతో ఇద్దరు ముగ్గురు అగ్రనేతల తీరు అధిష్టానానికి తలనొప్పిగా మారిందంటున్నారు. అధ్యక్ష రేసులో ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, రామచంద్రరావు పేర్లు వినిపిస్తున్నాయి. మరోవైపు అధ్యక్ష పదవి వద్దంటూనే దూకుడు ప్రదర్శిస్తున్నారు కేంద్ర మంత్రి బండి సంజయ్. ఆయన ప్రదర్శిస్తున్న దూకుడు, వ్యవహారశైలి, ప్రతిపక్ష అధికార పక్ష నేతలపై చేస్తున్న వ్యాఖ్యలు.. ఇవన్నీ కూడా బండి సంజయ్ అధ్యక్షుడి రేసులో ఉన్నాడని చెప్పకనే చెబుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్షుల ఎన్నిక ఒక కొలిక్కి వచ్చినప్పటికీ తెలంగాణలో ఎవరన్న చిక్కుముడిని అధిష్టానం విప్పలేకపోతోంది. రాష్ట్ర బీజేపీ నేతల తీరుతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్న ప్రచారమూ జోరందుకుంది. మహిళ కోటాలో మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ పేరు తెరపైకి వచ్చింది. బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావు పేరు కూడా తెరపైకి వచ్చాయి. అధ్యక్ష పదవి తమనే వరిస్తుందంటూ కొందరు నాయకులు ప్రచారం చేస్తున్నారు. దీనిపై ఇవాళే ప్రకటన వస్తుందనే చర్చ కూడా సాగిస్తున్నారు. సోషల్ మీడియాలో ఒకరిపై మరొకరు కామెంట్లు చేసుకోవడం, పార్టీ చీఫ్ పదవి తమ నేతకే వస్తుందని వాళ్ల అనుచర వర్గం ప్రచారం చేసుకోవడం పార్టీని నాయకత్వాన్ని మరింత ఇరుకున పెట్టేదిగా మారింది. ఈ తీరు బీజేపీ జాతీయ నాయకత్వానికి కొంత తలనొప్పిగా మారింది. ఈ పరిస్థితుల్లో పార్టీ చీఫ్ ఎన్నికపై అభిప్రాయ సేకరణ కోసం రాష్ట్రానికి రావాల్సిన ఇంఛార్జ్ శోభ కరంద్లాజే రాక ఆలస్యం అవుతోందని తెలుస్తోంది. వాస్తవానికి గత నెల 25వ తేదీనే నూతన అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అధ్యక్ష పదవి ఎంపికలో తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న అధిష్టానం ఈ నెల 10వ తేదీలోగా కొత్త అధ్యక్ష ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని భావించింది. రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇంచార్జీగా నియమితులైన శోభా కరంద్లాజే నేతల మధ్య ఏకాభిప్రాయాన్ని తీసుకుని తుది నిర్ణయం వెల్లడిస్తారంటూ ప్రచారం కూడా జోరందుకుంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి వెళ్తే నేతల పరస్పర ఫిర్యాదులతో కొత్త తలనొప్పులు వస్తాయన్న ఉద్దేశ్యంతో రావడం లేదని, పార్టీ అగ్రనేతలు అమిత్ షా, మోడీ, జేపీ నడ్డాలు జోక్యం చేసుకుంటే తప్ప అధ్యక్షుడు ఎవరనేది తేలవచ్చన్న ప్రచారం ప్రస్తుతం నడుస్తోంది.

# స్థానిక ఎన్నికల్లో నో యునానివస్

## నోటాతో పోటీ పడాల్సిందే.. సుప్రీం కోర్టు సంచలన నిర్ణయం

**మహా :** స్థానిక సంస్థల ఎన్నికలు తరుముకొస్తున్న వేళ తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన నిర్ణయం కొంత ఆందోళన కలిగిస్తోంది. గ్రామాలలో స్నేహ పూరిత వాతావరణం దెబ్బతినకుండా స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ సారే కాదు స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు జరిగినా పాలకులు పోటీ లేకుండా సర్పంచ్, వార్డు సభ్యులను వీలైనంత మందిని ఎక్కువగా ఎంపిక చేసేలా గ్రామస్థులను ప్రోత్సహించడం ఆనవాయితీ. ఏకగ్రీవాలను ప్రోత్సహించేందుకు గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం కొంత మొత్తాన్ని బహుమతిగా ప్రకటిస్తూ వస్తోంది. అయితే తాజాగా సుప్రీంకోర్టు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలపై లైక పెడుతూ నిర్ణయం తీసుకుంది. సర్పంచ్, వార్డు మెంబర్ గా ఒక్కరే నామినేషన్ వేసినప్పటికీ నోటాతో పోటీని ఎదుర్కోవాలని ఆదేశించింది. సర్పంచ్, వార్డు మెంబర్లకు పోటీ లేకుండా ఉన్నా ఒకరో ఇద్దరో సదరు అభ్యర్థిని వ్యతిరేకించే వారుంటారని, అయితే ఎంత మంది సదరు అభ్యర్థిని వ్యతిరేకించారన్న అంశంపై కూడా స్పష్టత రావాల్సి ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు ఏకగ్రీవమైనా నోటాను పోటీగా భావించి బ్యాలట్ పద్ధతిలో ఓటింగ్ జరపాలని ఆదేశించం ఇప్పుడు సంచలనంగా మారింది. ఓటు హక్కు పౌరుడి ప్రాథమిక జక్క, ఆ హక్కును తెలియజేసేందుకు ఈ నిర్ణయం వల్ల వీలవుతుందని సుప్రీంకోర్టు భావించినట్లు స్పష్టమవుతోంది.

# సోదరి హల్దీ వేడుకల్లో డ్యాన్స్ చేస్తూ గుండెపోటుతో యువతి మృతి

## మధ్యప్రదేశ్ లో చోటు చేసుకున్న ఘటన



**మహా :** మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో ఎవరూ చెప్పలేరు. కానీ, సడెన్ గా వస్తుంది. రెప్పపాటులో ప్రాణం పోతుంది. అప్పటి వరకు ఎంతో ఆనందంగా ఉన్న వ్యక్తి సడెన్ గా మృత్యువు ఒడికి చేరుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని విదిష జిల్లాలో చోటు చేసుకుంది. అప్పటి వరకు స్టేజ్ పై ఎంతో ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తున్న యువతి సడెన్ గా కుప్పకూలింది. తన కజిన్ సోదరి హల్దీ వేడుకలో 2 వందల మంది పైగా అతిథులు ఉండగా వేదికపై బాలీవుడ్ సాంగ్ కు డాన్స్ చేస్తుండగా పరిణిత జైన్ అనే యువతి అకస్మాత్తుగా కుప్ప కూలిపోయింది. అక్కడ ఉన్నవారు ఆమెకు సీపీఆర్ చేసి ఆసుపత్రికి తరలించడానికి ప్రయత్నం చేయగా ఆమె అప్పటికే మృతి చెందినట్లుగా గుర్తించారు. దీంతో పెళ్ళి వేడుకలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

EDITORIAL సంపాదకీయం

# ఢిల్లీ విజయంలో ఒకే ఒక్కడు

## మోదీ షాలను మించిన ఘనుడు

ప్రస్తుతం బీజేపీలో నరేంద్ర మోదీ, అమిత్ షా తిరుగులేని నాయకులు.. వీరి వ్యూహాలను తట్టుకుని నిలబడటం సాధ్యమయ్యే పనికాదు. ఎక్కడ ఎన్నిక జరిగినా గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచించడంలో వీరిని మించినవారు లేరని కొందరు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. దేశంలో బీజేపీ బలంగా లేని ప్రాంతాల్లో ఆ పార్టీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతుందంటే దానికి ప్రధాన కారణం మోదీ, అమిత్ షా వ్యూహాలే. 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి ఢిల్లీలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలనే వీరిద్దరి ఆకాంక్ష నెరవేరలేదు. ఆప్ ముందు వీరి వ్యూహాలు రెండు సార్లు పనిచేయలేదు. మోదీ, అమిత్ షాలకు సాధ్యం కాని లక్ష్యాన్ని సుసాధ్యం చేసి చూపించారు ఢిల్లీకి చెందిన ఓ బీజేపీ నేత. 70 శాసనసభ స్థానాలున్న ఢిల్లీలో 48 స్థానాల్లో గెలుపొందిన బీజేపీ ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. ఢిల్లీలో ఎంతో బలమైన ఆప్ వంటి పార్టీని ఎదుర్కొని, బీజేపీకి ఘన విజయం అందించడంలో ఓ వ్యక్తి పాత్రను తప్పకుండా ప్రస్తావించాల్సిందే

**ఒకే ఒక్కడు..**


ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని గద్దెదించి.. తాము అధికారం చేపట్టాలనే బీజేపీ ప్రయత్నం రెండు సార్లు ఫలించలేదు. అయినప్పటికీ ఆప్‌పై బీజేపీ తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంది. అరవింద్ కేజ్రీవాల్ సైతం కేంద్రప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసేవారు. ఆప్, బీజేపీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. మరోవైపు సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకోవడంతో.. ఆ వర్గాలు కేజ్రీవాల్‌కు బలమైన ఓటుబ్యాంకుగా మారింది. ఈ పరిస్థితుల్లో ఆప్‌ను ఓడించడం బీజేపీకి ఈ జన్మలో సాధ్యం కాదని కేజ్రీవాల్ సైతం ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. అవినీతి రహిత పాలన లక్ష్యంగా పార్టీ పెట్టి, సామాన్యుడి ప్రతినిధిగా రాజకీయాల్లోకి వచ్చి ఢిల్లీలో అధికారం చేపట్టిన కేజ్రీవాల్ ప్రభుత్వంపై మద్యం కుంభకోణం ఆరోపణలు రావడంతో వారి ప్రతిష్ట దిగజారుతూ వచ్చింది. ఆ మద్యం కుంభకోణాన్ని బయటకు తీసుకొచ్చిన వ్యక్తి పర్వేశ్ వర్మ. ఆయన ఆధారాలు సేకరించి అధిష్టానానికి చెప్పడంతో.. ప్రొసీడ్ అంటూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పర్వేశ్ కేజ్రీవాల్ అవినీతిపై పోరాడారు. ఆప్ అధికారాన్ని కోల్పోవడంతో పాటు.. న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్ ఓడిపోవడానికి ప్రధాన కారణం లిక్కర్ స్కామ్ అనే చర్చ జరుగుతోంది.

**మద్యం పాలసీపై అనుమానంతో..**

ఢిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీలో అవకతవకలు జరిగాయనే సమాచారంతో పర్వేశ్ వర్మ మొత్తం వివరాలు సేకరించే పనిలో పడ్డారు. లిక్కర్ పాలసీలో అక్రమాలు జరిగాయని బీజేపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. మీరు అనుమతిస్తే దీనిని బయటపెడతానని చెప్పారు. ముందుగా ఆధారాలు సేకరించాలని పర్వేశ్‌కు బీజేపీ హైకమాండ్ సూచించింది. దీంతో హోటల్స్‌లో జరిగిన సమావేశాల వీడియోలను బయటకు తీశారు. మద్యం వ్యాపారంతో లింకులున్న వ్యక్తులు, పలువురు రాజకీయ ప్రముఖులు తరచూ సమావేశం కావడంపై అనుమానంతో అసలు ఏం జరుగుతుందనేదానిపై పూర్తిస్థాయి వివరాలు సేకరించడంతో ఢిల్లీ మద్యం కుంభకోణం అంశం వెలుగులోకి వచ్చింది. పర్వేశ్ సేకరించిన వీడియోల ద్వారానే ఎమ్మెల్సీ కవిత పేరు బయటకు వచ్చింది. అప్పటినుంచి కేజ్రీవాల్ అవినీతిపై బీజేపీ తన పోరాటాన్ని కొనసాగిస్తూ వచ్చింది. ప్రజల్లోకి బలంగా లిక్కర్ స్కామ్ అంశాన్ని తీసుకెళ్లగలిగింది. చివరకు ఇటీవల జరిగిన ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో ఆప్‌ను ఓడించి బీజేపీ తన లక్ష్యాన్ని చేరుకుంది. ఈ లక్ష్య సాధనలో కీలకపాత్ర పోషించారు పర్వేశ్ వర్మ. ప్రస్తుతం ఢిల్లీ ముఖ్యమంత్రి రేసులో ఆయన పేరు వినిపిస్తోంది.



# చైనాలో కొత్త సంక్షోభం



చైనా లో కొత్త సంక్షోభం కలవరపెడుతోంది. ఒక్క చైనాలోనే కాదు.. అది భారత్ లోనూ, ఇతర దేశాల్లోనూ పెరుగుతున్నా చైనా భవిష్యత్తును మాత్రం ఆందోళనల్లో పడేస్తోంది. భారత దేశంలో విడాకుల కేసులు పెరుగుతున్నాయని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ చెప్పారు. చాలామంది డివోర్స్ పిటిషన్లతోనే కోర్టును ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి 600 కుటుంబాల్లో కేవలం 4 ఫ్యామిలీల్లోనే డివోర్స్ కేసులు లేవన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో రెండో స్థానంలోకి వెళ్లిన చైనా.. కొంతకాలంగా జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశంలో కొన్నేళ్లుగా వివాహాలు భారీ స్థాయిలో తగ్గిపోగా, విడాకులు భారీగా నమోదవుతున్నాయి. గతేడాది మొత్తంగా 61లక్షల వివాహ రిజిస్ట్రేషన్లు నమోదుకాగా.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 20శాతం తగ్గాయి. విడాకుల సంఖ్య పెరగడం చైనాను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. జనాభా పెరుగుదల కోసం చైనా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. అక్కడి యువత మాత్రం వివాహాల వైపు మొగ్గు చూపడం లేదు. చైనా పౌరవ్యవహారాల శాఖ నివేదిక ప్రకారం.. 2024లో దేశవ్యాప్తంగా 61లక్షల వివాహ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఏకంగా 20.5శాతం తగ్గాయి. వివాహాల రిజిస్ట్రేషన్ మొదలుపెట్టిన 1986 నుంచి ఈ స్థాయిలో తగ్గడం ఇదే మొదటిసారి. 2013లో 1.3 కోట్ల వివాహాలు నమోదు కాగా.. ప్రస్తుతం ఈ సంఖ్య సగానికంటే తక్కువగా నమోదైంది. చైనాలో విడాకుల సంఖ్య కూడా పెరుగుతున్నట్లు తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది 26లక్షల జంటలు విడాకుల కోసం దరఖాస్తు చేసుకోగా.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 28 వేలు అధికం. వీటి సంఖ్య తగ్గించేందుకు చర్యలు చేపట్టిన చైనా ప్రభుత్వం.. విడాకుల కోసం దరఖాస్తు చేసుకునే వారికి 30రోజుల 'కూలింగ్‌ఆఫ్' వ్యవధిని తప్పనిసరి చేసింది. 2021 నుంచి దీనిని అమలు చేస్తున్నప్పటికీ ఈ సంఖ్య పెరుగుతూనే ఉన్నట్లు తెలుస్తోంది. జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న చైనాలో గతేడాది శ్రామిక జనాభా 68.3లక్షలు తగ్గినట్లు తాజా నివేదిక పేర్కొంది. మొత్తం జనాభాలో 60ఏళ్లకుపైగా వయసు కలిగిన వారు 22శాతానికి పెరిగినట్లు తేలింది. మొత్తంగా దేశంలో జనాభా తగ్గుదలకు వివాహాల సంఖ్య తగ్గిపోవడమూ ఓ కారణంగా అధికారులు అంచనా వేస్తున్నారు. పెళ్లిళ్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ.. యువత మాత్రం వివాహం, పిల్లల వైపు మొగ్గుచూపడం లేదు. ఒక చైనాలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఈ ట్రెండ్ విస్తరిస్తోంది. ఉమ్మడి కుటుంబాలున్న భారతదేశంలోనూ ఇపుడు ఈ ట్రెండ్ మెల్లగా బలపడుతుండడం ఆందోళన కలిగించే పరిణామమే. కొత్త సంక్షోభం నుండి చైనా ఎలా బయటపడుతుందో చూడాలి.



# పంజాబ్ సీఎంగా కేజ్రీవాల్..?

**మహా:** ఢిల్లీకి దాదాపు పదేళ్ల పాటు సీఎంగా వ్యవహరించారు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత కేజ్రీవాల్. 2015 నుంచి 2024 సెప్టెంబరు వరకు ఏకధాటిగా దేశ రాజధానిని ఏలారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో జైలు కెళ్లి వచ్చాక గత ఏడాది సెప్టెంబరులో రాజీనామా చేశారు. ఇక తాజా ఎన్నికల్లో గెలుపొందితే కథ ఎలా ఉండేదో..? మరోసారి ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్ బాధ్యతలు చేపట్టేవారో లేదో తెలియదు కానీ.. ఓటమితో మాత్రం మాజీగా మిగిలిపోయారు. ఆప్ పుట్టిన తర్వాత అధికారానికి దూరంగా ఉన్నది కొద్ది కాలమే. ఓ సామాజిక కార్యకర్తగా 2012 నవంబరు 26న ఆప్ ను స్థాపించారు కేజ్రీ. సరిగ్గా 13 నెలల్లో అంటే 2013 డిసెంబరు 28న తొలిసారి సీఎం అయ్యారు. ఈ ప్రభుత్వం 2014 ఫిబ్రవరి వరకే కొనసాగింది. రాజకీయ సంక్షోభంతో తదుపరి రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చింది. అయితే, ఆ తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో ఘన విజయం సాధించింది ఆప్. గత శనివారం వరకు అధికారంలో కొనసాగింది. గత పదేళ్లలో ఆప్ పంజాబ్ ను గెలిచింది.. గుజరాత్ లో సత్తా చాటింది.. గోవా వరకు విస్తరించింది.. జాతీయ పార్టీ స్థాయికి కూడా ఎదిగింది. గోవా ఎన్నికల సందర్భంగానే మద్యం స్కాంతో అప్రదిష్ఠపాలైంది. తాజాగా ఢిల్లీలో ఓడిపోయింది. పంజాబ్ లో మూడేళ్ల కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆప్ అక్కడ సీఎంగా భగవంత్ సింగ్ మాన్ ను నియమించింది. ఇపుడు ఆయనను అసమర్థుడిగా ముద్ర వేసి తప్పించే యోచన చేస్తోందని బీజేపీ జాతీయ కార్యదర్శి మంజీందర్ సింగ్ సిర్సా ఆరోపించారు . అందుకనే కేజ్రీవాల్ మంగళవారం పంజాబ్ మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేశారని వ్యాఖ్యానించారు. మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో.. కేజ్రీని గొప్ప వ్యక్తిగా కొనియాడుతూ ఆయన పంజాబ్ సీఎంగా రావాలనే డిమాండ్ వస్తుందని మంజీందర్ తెలిపారు. ఇవన్నీ ఆరోపణలు, ఊహాగానాలే అయినా రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు. కేజ్రీ రాజకీయంగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారు. ఢిల్లీ మద్యం స్కాం అనే కాదు.. ఆప్ ను పాతాళానికి తొక్కేయాలని బీజేపీ చూస్తోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో కేజ్రీ కూడా 'తాను పదవిలో' శ్రేయస్కరంగా భావించి పంజాబ్ సీఎం పగ్గాలు చేపట్టినా ఆశ్చర్యపోవనసరం లేదు. రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే. పదవి చేపడితేనే కేజ్రీ సురక్షితమవుతారు.

# గర్భం ధరించిన విషయం మూడు నెలల వరకు బయటికి చెప్పరు ఎందుకు?



గర్భం దాల్చిన తర్వాత 3 నెలల పాటు గర్భిణులను ఆ విషయం బయటికి చెప్పొద్దని అమ్మమ్మలు సలహా ఇస్తుంటారు. అయితే ప్రెగ్నెన్సీని మూడు నెలలు ఎందుకు దాస్తారో తెలుసా? దీనికి ఒక కారణం ఉంది.

**ప్రెగ్నెన్సీ గురించి ఎప్పుడు బయటికి చెప్పాలి?**

ప్రెగ్నెన్సీ అనేది స్త్రీ జీవితంలో ఎంతో సంతోషకరమైన సందర్భం. ఆ విషయాన్ని ఆమె ఎంతో ఆనందంగా బయటికి చెప్పాలని అనుకుంటారు. అయితే ఇంట్లోని అమ్మమ్మలు, నాన్నమ్మలు మాత్రం ప్రెగ్నెన్సీ విషయాన్ని వెంటనే బయటకి చెప్పనివ్వరు. గర్భం వయసు మూడు నెలలు దాటాకే అందరికీ చెప్పేందుకు అనుమతిస్తారు. ఇప్పుడు మహిళలు చాలా ఆలస్యంగా కుటుంబాన్ని ప్లాన్ చేసుకుంటున్నారు. ఒక మహిళ గర్భం దాల్చినప్పుడు, కనీసం మూడు నెలల వరకు గర్భం గురించి ఎవరికీ చెప్పవద్దని ఎంతో మంది సలహాలు ఇస్తారు. అటువంటి పరిస్థితిలో, గర్భధారణ శుభవార్తను మూడు నెలలపాటు ఎందుకు దాచమని చెబుతారో పెద్దలు వివరిస్తున్నారు.

**గర్భం గురించి ఎప్పుడు బయటపెట్టాలి?**

గర్భం ధరించాక మొదటి త్రైమాసికం అంటే గర్భం దాల్చిన తరువాత మొదటి మూడు నెలలు చాలా ముఖ్యమైనవి. ఈ సమయంలో తల్లి పొట్టలో ఉన్న బిడ్డకు సంబంధించిన ప్రధాన అవయవాలన్నీ ఏర్పడతాయి. దీని వల్ల స్త్రీ శరీరంలో అనేక మార్పులు సంభవిస్తాయి. అందుకే గర్భిణులు కూడా మొదటి మూడు నెలలు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చాలా మంది గర్భధారణ వార్తలను ఎవరికైనా చెప్పడానికి మూడు నెలలు వేచి ఉండటానికి ఇష్టపడతారు ఎందుకంటే ప్రారంభ నెలల్లో గర్భస్రావం అయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. చాలా గర్భస్రావాలు మొదటి త్రైమాసికంలో అంటే 12 వారాలలో సంభవిస్తాయి. అందుకే గర్భం నిలిచిన తరువాతే బయటికి చెప్పేందుకు ఇష్టపడతారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ గర్భం దాల్చిన ఆరు నుండి ఎనిమిది వారాలలో చేస్తారు. ఇందులో శిశువు హృదయ స్పందన ఎలా ఉందో, బిడ్డ ఎదుగుదల ఎలా ఉందో చూస్తారు. గర్భం ఆరోగ్యకరంగా ఉందో లేదో చెబుతారు. గర్భం ఆరోగ్యంగా ఉందని నిర్ధారించుకున్నాకే ప్రెగ్నెన్సీ గురించి అందరికీ చెప్పాలని అంటారు. ప్రారంభ రోజుల్లో కొంతమంది సన్నిహిత కుటుంబ సభ్యులకు మాత్రమే గర్భం ధరించినట్టు చెబుతారు. అయితే సన్నిహితులు, ఇతర స్నేహితులకు కూడా చెప్పాలంటే గర్భం ఆరోగ్యంగా ఉందని, గర్భస్రావం అయ్యే అవకాశం లేదని నిర్ధారించుకున్నాకే చెప్పాలి. గర్భం ధరించిన తరువాత చాలా జాగ్రత్తగా ఉండాలి. గర్భిణులు సంతోషంగా ఉండేందుకు ప్రయత్నించాలి. గర్భం ధరించిన మొదటి మూడు నెలలు చాలా జాగ్రత్తగా ఉండాలి. దూర ప్రయాణాలు చేయకూడదు. కారు డ్రైవింగ్, స్కూటీ డ్రైవింగ్ వంటివి మానేయాలి. రాత్రిపూట ఎనిమిది గంటలు నిద్రపోవాలి. ఇక పగటిపూట ఒక గంట నిద్రపోవాలి.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
9247580946

# ఇంటర్‌లో మార్పుల భయం.. ఒక ప్రశ్నతో ఒత్తిడి

**మహా:** ఇంటర్ లో మార్పులు పరీక్షల ముందు విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఇంగ్లిష్ పేపర్ లో ఒక ప్రశ్నను అదనంగా చేర్చింది. వచ్చే నెలలో జరిగే ఇంటర్ పరీక్షల నుంచి ఇది అమలులోకి రానుంది. ఇంతకుముందు ఇంగ్లిష్ పేపర్ లో ప్రశ్నల సంఖ్య 16 ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 17 కు పెంచుతున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ అదనపు ప్రశ్నను సెక్షన్ సీలో ఇచ్చేందుకు అధికారులు రెడీ అయ్యారు. ఈ సెక్షన్ లో గతంలో ఐదులు ప్రశ్నలు ఉండగా.. ఇప్పుడు ఆరు ప్రశ్నలను ఇవ్వనున్నారు. మ్యాచ్ ది ఫాలోయింగ్ ప్రశ్నను అదనంగా చేర్చారు. మార్చిన మోడల్ పేపర్ ను వచ్చే పరీక్షల్లో అందుబాటులోకి తేవాలని ఇంటర్ బోర్డు ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది.

**సెక్షన్ -సీలో మార్పు**

ఇంతకుముందు ఇంగిష్ పేపర్ లో సెక్షన్ సీ లో ఒక ప్రశ్నకు 8 మార్కులు ఉండేవి. రిమైనింగ్ ప్రశ్నలకు 4 మార్కులు ఉండేవి. అయితే కొత్తగా సవరించిన ప్రశ్నాపత్రంలో 8 మార్కుల ప్రశ్నను 4 మార్కులకు తగ్గిలంచి.. కొత్తగా జతచేసిన ప్రశ్నకు 4 మార్కులు కేటాయించారు. అంతే కాకుండా.. దాన్ని మ్యాచ్ ది ఫాలోయింగ్ కిందగా చేర్చారు. దానిలో 10 ఇస్తే 8 జతపరచాలి. ఒక్కో దానికి అర మార్కు చొప్పున అంటే 4 మార్కులకు ఆ ప్రశ్నను కేటాయించారు. ఇంటర్ స్టూడెంట్స్ ఏడాదంతా నేర్చుకున్న ఇంగ్లిష్ పేపర్ ను ఒక ప్రశ్నతో కొంత ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని స్టూడెంట్స్ తల్లిదండ్రులు, కాలేజీల అధ్యాపకులు భావిస్తున్నారు. సడెన్ గా పరీక్షలకు ముందు ఇంగ్లిష్ పేపర్ లో మార్పులు తీసుకొస్తే నష్టం చేకూరే అవకాశం ఉంటుందని కాలేజీల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు ప్రశ్నిస్తున్నారు. ఇలా సడెన్ మార్పులు తీసుకొస్తే చాలా మంది విద్యార్థులకు అంత త్వరగా అర్థం కావని చెబుతున్నారు. ముఖ్యంగా గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో స్టూడెంట్స్ సగం మంది మాత్రమే క్లాసెస్ కు హాజరవుతారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ మార్పును ఎలా వివరించాలో అధ్యాపకులు ఇంటర్ బోర్డును నిలదీస్తున్నారు. ఎగ్జామ్స్ కు నెల ముందు ఇలాంటి మార్పులు, చేర్పులు చేస్తే విద్యార్థులు మిగిలిన పేపర్లపై ఫోకస్ సరిగ్గా పెట్టలేరని ఇంటర్ విద్యాశాఖ అధికారులు నిలదీస్తున్నారు. పరీక్షలకు సమయం దగ్గర పడుతుండడంతో క్లాసెస్ కు వచ్చే వారి సంఖ్య క్రమంగా తగ్గుపోతుంది. ఎగ్జామ్స్ దగ్గరవుతోన్న కొద్ది స్టూడెంట్స్ కొంత ఆందోళనకు గురవుతారు. ఇంకా ప్రశ్నా పత్రం సవరిస్తే ఒత్తడి మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు చెబుతున్నారు. ఎగ్జామ్స్ సమీపించిన సమయంలో ఇలాంటి మార్పులు చేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది.



## అర్జీలపై తక్షణమే స్పందించి పరిష్కరించండి

### బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే





**వరంగల్, మహా:** ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పై తక్షణమే స్పందించి వాటిని సత్వరమే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా..
1.ఇంజనీరింగ్....16,
2.హెల్త్ & సానిటేషన్.....08
3.ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)...11,
4.టౌన్ ప్లానింగ్....32
5.మంచినీటి సరఫరా.......07
6.హార్టికల్చర్....01
మొత్తం = 75 గా అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర సి ఎం హెచ్ ఓ డా.రాజా రెడ్డి, హెచ్ ఓ లు రమేష్, లక్ష్మారెడ్డి బయాలజిస్ట్ మాధవ రెడ్డి, ఇన్చార్జి సి పి రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్స్ హమాలీలకు 30 శాతం బోనస్ ఇవ్వాలి



**హుజూర్ నగర్, మహా:** హుజూర్నగర్ హమాలి కార్మిక సంఘం రైస్ మిల్ యాజమాన్యానికి పది డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని రైస్ మిల్లర్ల అసోసియేషన్ కు రైస్ మిల్లర్ల హమాలీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మేకల నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఇచ్చారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇప్పుడున్న ధరలపై అదనంగా 30శాతం ఇవ్వాలని, బోనస్, పిఎఫ్, గ్రాట్యుటీ, లాంటి సౌకర్యాలు కల్పించాలని లారీ దిగుమతి మామూలు ట్రాక్టర్ దిగుమతి మామూలు బోరాల దిగుమతి వలస కార్మికులకు కనీస వసతి సౌకర్యాలు కల్పించాలని పూణేల్లో పాండురంగ హడావు నాయకత్వంలో హమాలీలంతా సంఘటితమై పోరాడి అనేక హక్కులు సాధించుకున్నారని, బస్తాలు మోసి మోసి మోకాళ్లు, వెన్నెముక అరిగిపోతున్నాయని వారికి ప్రభుత్వమే ఉచితంగా వైద్య సహాయం చేయాలని డిమాండ్ చేసి విజయం సాధించారన్నారు. ఇంకా విద్య, సహకార బ్యాంకు తదితర సౌకర్యాలతో పాటు వీటన్నిటిని చట్టబద్ధం చేస్తూ 1969 లోనే మత్తడిలాని తెచ్చిందని ఇక్కడ కూడా ఆ రకమైనటువంటి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. హమాలీలకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత విద్య, వైద్యం పారిశ్రామిక వాడలో విశ్రాంతి భవనం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం అధ్యక్షులు పాత్తబోయిన గురవయ్య, రాజు, పటేల్, ప్రభు, చిన్న నాగేశ్వరరావు, ముఖేష్ రైస్ మిల్ యాజమాన్యం నుండి అధ్యక్షులు పోలిశెట్టి నరసింహారావు, మాజీ అధ్యక్షులు అప్పారావు పాల్గొన్నారు.

## కుల గణన ఘనత కాంగ్రెస్సుదే



**హుజూర్ నగర్, మహా:** కులగణన ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాహోసోపేతమైన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోషం వ్యక్తపరిచారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలను జరుపుకున్నారు .ఈ సందర్భంగా టిపిసిసి జాయింట్ సెక్రెటరీ ఎండి అజీజ్ పాషా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ లు మాట్లాడుతూ... శాస్త్రీయ పద్ధతిలో కుల గణన చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంకే దక్కిందని నిరుపేదలకు మేలు చేయాలనే లక్ష్యంతోనే బీ.సీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల బిడ్డలకు అన్ని రంగాలలో మేలు చేయాలనే లక్ష్యంతో కీలక పాత్ర పోషించిన నేత మంత్రి ఉత్తమ్ కు హుజూర్నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక,ఆర్థిక,విద్య, ఉపాధి,రాజకీయ,కులగణన సర్వే చారిత్రాత్మకమని అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే దశాబ్దాల బీసీల కులగణన ఆకాంక్షలు నెరవేర్చడం గర్వకారణమని 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి పరిష్కారం దిశగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేసి రిజర్వేషన్ ఖరారు చేసిందని వారన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కుల మల్లయ్య, సమ్మెట సుబ్బరాజు, చిట్యాల అమర్నాథ్ రెడ్డి, ఎస్.కె ముస్తఫా,తేజావత్ రాజా, శ్రీనివాస్ గౌడ్ బొడ్డు గోవిందరావు, గంజి శివ,తదితరులు పాల్గొన్నారు.





## బాజీ రావు సప్తాహ ముగింపు వేడుకల్లో పాల్గొన్న

### కంది మౌనా శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా :** ప్రజలందరి ఆశీర్వాదాలు తనపై తన భర్త ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి పై ఉండాలని కంది మౌనా శ్రీనివాస రెడ్డి కోరారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం బెల్గాం గ్రామంలో జరిగిన బాజీ రావు బాబా సప్తాహ వేడుకల ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. నిర్వాహకులు గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.బాజీరావు బాబా విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దహి హండి కాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాజీ రావు బాబా బోధనల వల్ల ఎన్నో గ్రామాలలో మంచి మార్పు వచ్చిందన్నారు.ఆయన బోధనలకు ప్రభావితులై మద్యానికి బానిసైన వారు కూడా మానేసి సత్ప్రవర్తనతో మెలుగుతున్నారన్నారు. అంతటి ప్రభావితమైన బాజీరావు బాబా బోధనలను ప్రక్క జిల్లాలకు కూడా తీసుకెళ్లవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,ఆదిలాబాద్ రూరల్ మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అల్చెట్టి నాగన్న,మాజీ సర్పంచ్ విలాస్,నాయకులు యెల్టీ జగదీష్ రెడ్డి,బద్దం సంతోష్ రెడ్డి,అడ్డి పురుషోత్తం రెడ్డి,గడ్డం హనుమాంత్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ,దేశెట్టి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి పట్టుబడ్డ పంచాయతీరాజ్ ఏఈ



**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా సంగెం మండలంలో పంచాయతీరాజ్ ఏఈ గా విధులు నిర్వహిస్తున్న రమేష్ సోమవారం హనుమకొండలో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వివరాల్లోకెళ్తే.. సంగెం మండలం కుంటపల్లి గ్రామంలో ఓ ఇంటి నిర్మాణం కోసం బాధితుల నుంచి పదివేల రూపాయల డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు.. కాగా ఏఈ రమేష్ అక్రమఆస్తుల గురించి కూడా అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.



## విశ్వకర్మ జయంతిలో

### పాల్గొన్న కంది మౌనా శ్రీనివాసరెడ్డి

**ఆదిలాబాద్, మహా :** విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని, వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే విధంగా జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాసరెడ్డి భరోసా కల్పించారు. బేల మండల కేంద్రంలోని విశ్వ కర్మ భవన్ లో జరిగిన విశ్వకర్మ జయంతికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నిర్వాహకులు ఆమెకు సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ముందుగా ఆమె విశ్వకర్మ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంజయ్ గుండావార్,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్ వాంఖడే,ఆదిలాబాద్ రూరల్ మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అల్చెట్టి నాగన్న,నాయకులు టాక్రే సాగర్,హేమంత్ పటేల్,ఎల్మ రామ్ రెడ్డి,బూబన్ రమేష్,షేక్ ఫిరోజ్,మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ,దేశెట్టి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



## యువత స్వశక్తితో ఎదగాలి

**హుజూర్ నగర్, మహా:**యువత స్వశక్తితో ఎదగాలని బిఆర్ఎస్ పార్టీ గిరిజన నాయకులు అన్నారు. సోమవారం హుజూర్నగర్ నియోజకవర్గ కేంద్రంలో గల పొట్టి శ్రీరాములు సెంటర్ దగ్గర శ్రీ చందన లేడీస్ ఎంపోరియం మరియు గిఫ్ట్ ఆర్టికల్ షాపును బిఆర్ఎస్ పార్టీ గిరిజన నాయకులు ఘనంగా ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు అయిన షాపును లేదా సంస్థను సమాజంలో పేరు గాంచిన ఎవరైనా ముఖ్యనాయకులతో ప్రారంభోత్సవము చేయిస్తారు కానీ ఈ షాప్ ను షాప్ ఓనర్ కోలాటం మాస్టర్ చిరంజీవి తల్లి వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం వారి తల్లి గారి ఋణం ను ఈ విదంగా తీర్చుకోవడం గొప్ప విషయం ఇది చక్కటి పరిణామం అని అదేవిధంగా ఈ షాపు దిన దినాభివృద్ధి జరగాలని మనసారా కోరారు ఈ కార్యక్రమంలో మఠంపల్లి మాజీ జడ్పిటిసి జగన్ నాయక్ మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు న్యాయవాది నగేష్ రాథోడ్, బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్, బుక్య చంద్రమౌళి, ఇస్లావత్ బాలాజీ నాయక్, కోలాటం మాస్టర్ చిరంజీవి, ములకపల్లి రాంబాబు, బాణావత్ కోట, బాలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఏ.ఎస్.ఐ సువర్ణ కు కాంస్య పతకం

### సత్కరించిన సిపి అంబర్ కిషోర్ ఝా

**వరంగల్, మహా:** జాతీయ షూటింగ్ క్రీడల్లో ఛాంపియన్ షిప్ పోటీల్లో మహిళా ఏ.ఎస్.ఐ సువర్ణ కాంస్య పతకాన్ని సాధించింది.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సుబేదారి పోలీస్ స్టేషన్ ఏ.ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్న సువర్ణ గత డిసెంబర్ 15 తేది నుండి 31తేది వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ లో నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జరిగిన 67 జాతీయ షూటింగ్ క్రీడల ఛాంపియన్ షిప్ లో తెలంగాణ రాష్ట్రం తరుపున పాల్గొన్న సువర్ణ 50 మీటర్లు ప్రోన్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించింది. ఈ పోటీల్లో అంతర్జాతీయ క్రీడాకారులతో పోటీపడిన సువర్ణ 600లకు 581 పాయింట్లు సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలసి సువర్ణను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, సుబేదారి ఇన్స్ స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మతులు నోచుకొని పబ్లిక్ టాయిలెట్లు,మరమ్మతులు చేస్తారా..తొలగిస్తారా..?




**ఉప్పల్,మహా:** పబ్లిక్ టాయిలెట్లు సమాజానికి ఎంతో ప్రాముఖ్యమైనవి, ఎందుకంటే అవి సాధారణ ప్రజల అవసరమైన సౌకర్యాలను అందిస్తాయి. మరమ్మతులు మరియు నిర్వహణ చేయడం ప్రజా అవసరాల దృష్ట చాలా ముఖ్యం.సాధారణంగా, పబ్లిక్ టాయిలెట్లు మరమ్మతులు చేయడమే ప్రధానమైన విధి. కానీ నేడు లక్ష్యం నీరు కారిపోతుంది అని ప్రజల అభిప్రాయం, కొన్ని సందర్భాలలో టాయిలెట్లు చాలా చెడిపోయి పని చేయలేనప్పుడు, లేదా కొత్త మరియు మెరుగైన సౌకర్యాలతో టాయిలెట్లను నిర్మిచాలని,ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉప్పల్, చిల్కానగర్, రామంతపూర్, హబ్సిగూడ డివిజన్ ప్రాంతాలలో అనేకచోట్ల పబ్లిక్ టాయిలెట్లు ములకుపడ్డాయి.మహిళల కోసం ప్రత్యేకమైన టాయిలెట్లు అందివ్వడం తమకున్న భద్రతను పెంచుతుంది మరియు ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది, కాని నిర్వహణ లోపంతో ఈ పరిస్థితి ఏర్పడడంతో, లక్షలాది రూపాయలు పెట్టి నిర్మించిన టాయిలెట్స్ లక్ష్యం నీరు కారిపోయింది. ప్రజలకు అవసరానికి తగ్గట్టు మరమ్మతులు చేస్తారా..? ఆయా ప్రాంతాల నుంచి పూర్తిగా తొలగిస్తారా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## భూక్య సుమన్ ను కలిసిన బాలాజీహిల్స్ ఫేస్-3

### కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు



ఉప్పల్,మహా:బోడుప్పల్ నగరపాలక సంస్థ 21డివిజన్ పరిధిలోని బాలాజీహిల్స్ ఫేస్3 కాలనిలో ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన నూతన అసోసియేషన్ సభ్యులు స్థానిక నాయకులు భూక్య సుమన్ ని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు, ఈ సందర్భంగా వారు సానుకూలంగా స్పందిస్తూ నూతన సంక్షేమ సంఘం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వెలిగొండయ్య, నూతన కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ వేణుమాధవ్, ట్రెజరర్వెంకటేశ్వర్లు, ముఖ్య సలహాదారులు ఉపేందర్ రెడ్డి, రంజిత్ రెడ్డి, నాగరాజు, రవీందర్ రెడ్డి, సుధాకర్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్లో మహా ధర్నాకు కేటీఆర్ వెంట

### బయలుదేరిన మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి



**ఉప్పల్,మహా:** కొడంగల్ కోస్గిలో బీఆర్ఎస్ రైతు నిరసన దీక్ష నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్నారు. రుణమాఫీ, రైతు సమస్యలపై చేపట్టే నిరసన దీక్షలో కేటీఆర్ పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో కొడంగల్ రైతు మహా ధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బయలుదేరారు.కొడంగల్ లో రైతు మహా ధర్నాకు బయలు దేరుతున్న KTR ని వారినివాసంలో కలిసి వారితో పాటు ధర్నాలో పాల్గొనడానికి వారి వెంట బయలుదేరిన మాజీ జడ్పీటీసీ,బోడుప్పల్ BRS పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి,బోడుప్పల్ మాజీ మేయర్ సామల బుచ్చి రెడ్డి మీసాలు కృష్ణ జాడిగేరమేష్ కొత్త చక్రపాణి గౌడ్ రాంచేందర్ రెడ్డి Brs నాయకులు మాదారం రాంకుమార్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు ఉన్నారు.




## జర్నలిజం కోర్సుతో విస్తృత ఉపాధి అవకాశాలు

### కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక

**ఇబ్రహీంపట్నం, మహా:** జర్నలిజం కోర్సు ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక అన్నారు. కళాశాల చరిత్ర విభాగం నిర్వహిస్తున్న తెలుగు జర్నలిజం ప్రాథమిక అంశాలు అనే సర్టిఫికెట్ కోర్సును ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. సమాజంలో జర్నలిస్టులకు ఉన్న ప్రాధాన్యతను ఆమె ప్రస్తావించారు. కళాశాల విద్యార్థులు ఈ కోర్స్ ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోర్సు సమన్వయకర్త డాక్టర్ సివి పవన్ కుమార్ కోర్సు లక్ష్యాలను, కోర్సులో భాగంగా బోధించే అంశాలను వివరించారు. తాను జర్నలిస్టుగా పనిచేసిన అనుభవాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన జర్నలిజం వృత్తిని ఎంపిక చేసుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. సమాజంలోని లోపాలను సరిదిద్దేందుకు మీడియా ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుందని అర్థశాస్త్రధ్యాపకులు డాక్టర్ రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కృష్ణ, సురేష్, మాధవి, సురేఖ, నీలిమ, కరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కంది శ్రీనివాస రెడ్డి దంపతుల పెళ్ళిరోజు వేడుకలు





**ఆదిలాబాద్, మహా :** కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాసరెడ్డి, కంది మౌనా శ్రీనివాస రెడ్డి దంపతుల పెళ్లిరోజు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్ లో పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు మిత్రుల నడుమ కంది మౌనా శ్రీనివాసరెడ్డి తన కుమారుడితో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. మహిళా కాంగ్రెస్ శ్రేణులు ఆమెకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. హాజరైన వారంతా పూలబోకేలు అందజేసి పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాలు కప్పి సత్కరించారు. ఆశించిన లక్ష్యాలను చేరుకోవాలని నిండూనూరేళ్లు ఆయురారోగ్యాలు, ఐష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా శ్రేణులు అభిలాషించారు. భారీ సంఖ్యలో విచ్చేసిన నాయకులు,కార్యకర్తలు,అభిమానుల తో ప్రజాసేవా భవన్ సందడిగా మారింది. అనంతరం కంది మౌనా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పం తోనే తనూ తన భర్త, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ప్రజా క్షేత్రం లో ముందుకు సాగుతున్నామని అన్నారు. ఇంత మంది అభిమానుల మధ్య వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏదో ఒక సందర్భంలో ఇలా నాయకులను కార్యకర్తలను అభిమానులను కలుసుకోవడం వల్ల క్యాడర్ తో బంధం మరింత బలపడుతుందన్నారు. ఎల్లప్పుడు ప్రజల కోసం పని చేస్తూ వారి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగడమే తమ కర్తవ్యమన్నారు.అనంతరం అంతా కలిసి విందు భోజనాలు ఆరగించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పట్టణంతో పాటు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆదిలాబాద్ రూరల్ , మావల , సాత్నాల, భోరజ్ , జైనథ్ ,బేల మండలాల నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మిత్రులు పాల్గొన్నారు

## రక్తదానం..మహాదానం



**సూర్యాపేట జిల్లా, మహా:** హుజూర్ నగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి నందు బుచ్చమ్మ అనే మహిళకు గర్భసంచి ఆపరేషన్ కొరకు బి పాజిటివ్ బ్లడ్ అవసరమై ఉండగా...బుచ్చమ్మ బంధువులు డిఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావును సంప్రదించగా బాబురావు వెంటనే డోనర్ పరిటాల నాగరాజు కు ఫోన్ చేసి చెప్పగా కోదాడ బ్లడ్ బ్యాంక్ కు పంపించి రక్తం ఇప్పించడం జరిగింది.ఈ సందర్భంగా పేషెంట్ బంధువులు దగ్గుపాటి బాబురావు, డోనర్ పరిటాల నాగరాజు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



### నామినేషన్ కార్యక్రమానికి హాజరైన

## కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్,మహా:** ఆదిలాబాద్ నిజామాబాద్ కరీంనగర్ మెదక్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు.కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు , విప్ ఆది శ్రీనివాస్ లను కలిసి పలు విషయాలపై చర్చించారు.వారిని కంది శ్రీనివాస రెడ్డి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కంది శ్రీనివాస రెడ్డిని శాలువాతో సత్కరించారు. నామినేషన్ కార్యక్రమం అనంతరం ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క నేతృత్వంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.



## హుస్నాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**మహా, హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి రాష్ట్రంలోనే మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. పలు వీధుల్లో పర్యటించారు. పక్కనే ఉన్న టిఫిన్ సెంటర్ కి వెళ్లి కాసేపు అక్కడ ప్రజలతో ముచ్చటించారు. అటువైపుగా వెళుతున్న పాఠశాల బస్ లోని విద్యార్థులకు అభివాదం చేశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓ పాఠశాల విద్యార్థికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించామని, పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. స్థానికంగా ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

**జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి..వివిధ శాఖల అధికారులకు ఆదేశాలు**



**ఇబ్రహీంపట్నం (రంగారెడ్డి జిల్లా) , మహా:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 67 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డిజటల్ ఏరియల్ భూ సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

**జిల్లా కలెక్టర్ డా.సత్య శారద**



**వరంగల్, మహా:** హెలికాప్టర్ ద్వారా నిర్వహిస్తున్న డిజటల్ ఏరియల్ భూ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ డా.సత్య శారద ఖాజీపేట లోని సెయింట్ గ్యాబ్రియల్ మైదానంలో సోమవారం క్షేత్ర స్థాయి లో పరిశీలించి సర్వే నిర్వహణ తీరును సాంకేతిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ డిపార్ట్మెంట్ ఆఫ్ ల్యాండ్స్ రికార్డ్స్ ద్వారా 'నక్ష' పథకంలో ప్రణాళికలు లేని పట్టణాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి సర్వే నిర్వహించడం జరుగుతున్నదని, వరంగల్ జిల్లాకు సంబంధించి వర్ధన్నపేట మున్సిపాలిటి పైలెట్ ప్రాజెక్టు లో భాగం గా ఎంపిక చేయడం జరిగిందని, ఇందుకు సంబంధించి ఏరియల్ ఫోటోగ్రఫీ టెక్నాలజీ (2డి)ను వినియోగిస్తూ సర్వే కొనసాగిస్తారని దీనివల్ల పట్టణ (అర్బన్) ప్రాంతాలలో ఉన్న నిర్మాణాలను, చెరువులు, కాల్వలు, రోడ్లు, హై టెన్షన్ విద్యుత్ వైర్లు నమోదు (క్యాప్చర్) చేసి ఆఅకాంక్షలు, రేఖాంశాలను నమోదు జరుగుతుందని, దీని వల్ల భూమికి సంబంధించిన నిజమైన యజమానులు ఎవరో గుర్తించడం సులభమవుతుందని టైటిల్ యజమానులు (హక్కుదారులు) ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్ తీరును గుర్తించవచ్చునని మున్సిపాలిటీల్లో ప్రాథమిక సమాచార సేకరణ లక్ష్యం (థీమ్)గా కేంద్ర ప్రభుత్వ డిపార్ట్మెంట్ ఆఫ్ ల్యాండ్స్ రికార్డ్స్ నుండి ఈ సర్వే కొనసాగుతుందని వర్ధన్నపేట మున్సిపాలిటీ మొత్తం ఏరియా 41 కి.మీ ఉందని నేటి (మంగళవారం)లోగా సర్వే పూర్తి చేస్తారని వారం రోజుల తర్వాత వీటికి సంబంధించిన చిత్రాలను (ఇమేజెస్) అందజేస్తారని, తదుపరి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం హెలికాప్టర్ లో అమర్చిన సర్వే సంబంధిత పరికరాలు వాటి పనితీరును గురించి కలెక్టర్ సాంకేతిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కోర్టులో న్యాయ పోరాటం ఆపై ఆత్మహత్యాయత్నం

- మా భర్త నాకు అన్యాయం చేశాడు
- నాకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు
- నా భర్త ఆస్తిలో వాటా ఇప్పించండి
- గిరిజన మహిళ కమలమ్మ ఆవేదన






**ఇబ్రహీంపట్నం, మహా:** తన భర్త ఆస్తిలో వాటా కావాలని న్యాయ పోరాటం చేస్తున్నా, అన్యాయం జరగడంతో కోర్టు ప్రాంగణంలో మహిళా ఆత్మహత్యాయత్నం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం, మంథని గౌరెల్లి సమీపంలో ఉన్న కేసీ తండాకు చెందిన జేర్పుల కమలమ్మ తన భర్త ఆస్తిలో వాట నేపథ్యంలో, గత కొంతకాలంగా ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ 15వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు నడుస్తున్న, ఆమె భర్త తనకు రావాల్సిన వాటాను అమ్మడం జరిగింది. కోర్టు కేసులో ఉన్న భూమిని, తనకు తెలవకుండానే అమ్మడంతో, కోర్టులో కూడా న్యాయం జరగడం లేదని మనస్థాపానికి గురైన కమలమ్మ సివిల్ జడ్జ్ 15వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు డీజిల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే అప్రమత్తమమై కమలమ్మను కాపాడి, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ తరలించారు. కమలమ్మ మాట్లాడుతూ భర్త ఆస్తిలో వాటా కావాలని, కోర్టులో సివిల్ కేసు వేశానని, న్యాయం కోసం పోరాడితే, నాకు అన్యాయం జరిగిందని వాపోయింది. ఈ క్రమంలో మనస్థాపం చెందిన కమలమ్మ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. యాచారం మండలం, మధన్ గౌరెల్లి, కేస్లి తండాకు చెందిన కమలమ్మతో 35 ఏండ్ల క్రితం చంద్రియ నాయక్ తో వివాహం జరిగింది. వీళ్ళకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కమలమ్మతో 20 ఏండ్లు కాపురం చేసిన తరువాత, చంద్రియ నాయక్ మరో మహిళను వివాహం చేసుకున్నాడు. అప్పటి నుండి ఇద్దరూ వేరు వేరుగా ఉంటున్నారు. చంద్రియ నాయక్ పేరు మీద ఉన్న రెండు ఎకరాల భూమి, తన మొదటి భార్యకు ఇవ్వకుండా అమ్ముకోవాలని ప్రయత్నం చేస్తుండగా, కమలమ్మ అడ్డుకొని కోర్టులో కేసు వేసింది. కోర్టులో కేసు నడుస్తుండగానే 20 గుంటల భూమి చంద్ర నాయక్ అమ్మేశాడు. దీంతో విసిగి పోయిన కమలమ్మ ఇద్దరు లాయర్లకు డబ్బులు ఇచ్చి ఎలాగైనా భూమి సాధించాలని ప్రయత్నం చేసింది. నాలుగు సంవత్సరాలుగా కోర్టు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో విసుగు చెందిన కమలమ్మ సోమవారం కోర్టు కేసు ఉండడంతో కోర్టుకు రావడం జరిగింది. కోర్టు ప్రాంగణంలో మెజిస్ట్రేట్ ముందు డీజిల్ పోసుకొని ఆత్మహత్యయత్నం చేసింది పోలీసు అడ్డుకున్నారు. నా భర్త భూమి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నాకు ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. నాకూ న్యాయం చేయాలని జడ్జిని పోలీసులను ఆవేదనతో వేడుకున్నారు.

# అబద్ధ హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కింది




- అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన ఏ ఒక్క హామీ అమలు చేయలే
- బీఆర్ఎస్ పార్టీ అబ్దుల్లాపూర్ మెట్ మండల విస్తృత స్థాయి సమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్ , మహా:** అబద్ధ హామీలతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండల బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం సోమవారం మండల కేంద్రంలో వై ఎన్ ఆర్ గార్డెన్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్ అధ్యక్షతన వహించాడు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అబద్ధ హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి... అధోపతి పట్టించారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగం కుదిలైందన్నారు. రియల్ ఎస్టేట్స్ రంగంలో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం తప్ప .. మరెవ్వరు లేరన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి ముందుండేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి దోచుకునుడు..దాచుకోనే మీద ఉన్న శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధి మీద లేదన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఏ ఒక్క వర్గ ప్రజలు కూడా సంతోషంగా లేరన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను కూడా ముప్పు తిప్పలు పెడుతున్నాడని విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పిదాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మీద ఉన్న వ్యతిరేకత బీఆర్ఎస్ కలిసి వస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపుకోసం కార్యకర్త నుంచి నాయకుల వరకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా.. పనిచేసే ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అధ్యక్షులు క్యామ మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు శిఖ సాయికుమార్, చెరుకు కిరణ్ గౌడ్, మదన్ వీరస్వామి యాదవ్, మహేందర్, పూజా చక్రవర్తి గౌడ్, ధనంజయ గౌడ్, లెక్కల విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫౌల్ట్రీలలో బర్డ్ ఫ్లూ వ్యాధి
## రైతులు జాగ్రత్తగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**

ఇబ్రహీంపట్నం (రంగారెడ్డి జిల్లా) ఫిబ్రవరి 10 మహా: ప్రక్క రాష్ట్రంలోని ఫౌల్ట్రీలలో బర్డ్ ఫ్లూ వ్యాధి సోకుతున్నందున, కోళ్ల ఫారాల యజమానులు ఏదైనా బర్డ్స్ చనిపోతే వెంటనే సంబంధిత వెటర్నరీ దవఖానాలో సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమంలో వెటర్నరీ అధికారి బర్డ్ ఫ్ల్యూ వ్యాధిపై, ప్రభుత్వం ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని సూచించినందున కలెక్టర్ జిల్లాలోని కోళ్ళ ఫారాల యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వెటర్నరీ సిబ్బంది కోళ్ళ ఫారాలకు వచ్చినప్పుడు సహకరించి వారికి, ఏదేని కోళ్ళ ఫారాలలో ఎక్కువ మొత్తంలో కోళ్లు చనిపోతో వెంటనే సమాచారం అందించాలని అన్నారు. ఎక్కడైన కోళ్ళకు వ్యాధి సోకి చనిపోయినట్లైతే వాటిని పాతిపెట్టి, బయో కెమికల్ పౌడర్ చల్లాలని, ఇంకా వేరే కోళ్ళ ఫారాలకు సోకకుండా నివారించాలని తెలిపారు. మన రాష్ట్రంలోని ఖమ్మంలో బర్డ్ ఫ్లూ వ్యాధి సోకినందున జిల్లాలోని పౌల్ట్రీ యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.




# మణిపూర్ హింసకు బీజేపీ కారణం

**శ్రీ దేవ్ నారాయణ స్వామి మందిర్ ప్రారంభోత్సవంలో..రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే సచిన్ పైలట్**

**అబ్దుల్లాపూర్ మెట్, మహా:** మణిపూర్ హింసకు బీజేపీ కారణమని రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే సచిన్ పైలట్ అన్నారు. వీర్ గుర్జర్ సమాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన దేవ్ నారాయణ స్వామి మందిరం రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, కవాడి పల్లి గ్రామంలో నిర్మించారు. ఈ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే సచిన్ పైలట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మణిపూర్ హింసకు బీజేపీ పార్టీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీలే కారణమన్నారు. మణిపూర్ ఇరువురుగాల మధ్య జరుగుతున్న ఘర్షణలో వేలాదిమంది నిరాశ్రయులు అయ్యారన్నారు. కులాల, మధ్య, మతల మధ్య, బీజేపీ మంట పెడుతుందన్నారు. జాతుల వైరద్యానికి చరమగీతం పాడుతూ.. అల్లర్లను అదుపు చేయాలన్నారు. హింసకు ప్రేరేపిస్తున్న అల్లరి మూకలు పట్ల కఠిన చర్యలు చేపట్టి.. ఘర్షలను అదుపు చేయాలన్నారు. ప్రధాని మోడీకి అధికార దాహం తప్ప.. ప్రజల గోస పట్టడం లేదని ఎద్దేవా చేశారు. జతుల మధ్య జరుగుతున్న దాడుల వలన ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందన్నారు. ఇప్పటికైనా మణిపూర్ రాష్ట్రాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సందర్శించి.. బాధితులకు అండగా నిలిచి.. శాంతి భద్రత చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ రాజ్యసభ సభ్యులు వీ హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారులు (ప్రోటోకాల్) వేణుగోపాల్ రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్ర మహేందర్ గౌడ్, పండుగుల రాజు, పసుల రాజేందర్, ఎండీ గౌస్ పాషా, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన అర్చకులు రంగరాజన్ ను పరామర్శించిన మంత్రి

- దాడికి పాల్పడిన వారి పై చట్ట పరంగా చర్యలకు ఆదేశం..రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ



**వరంగల్, మహా:** మనదేశంలో హిందూధర్మం ఎన్నో నదులను తనలో కలుపుకునే మహాసముద్రం వంటిదని, అదే హిందూ ధర్మం గొప్పతనమని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మాత్యులు కొండా సురేఖ అన్నారు. రామరాజ్యం పేరుతో తెలంగాణ రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తూ రావణ రాజ్యం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని మంత్రి స్పష్టం చేశారు. కొందరు దుండగుల దాడిలో గాయపడి తీవ్ర విచారంలోవున్న చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్ తో పాటు వారి తండ్రి సౌందర రాజన్ ను మంత్రి సురేఖ వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారికి అన్నివేళలా అండగా వుంటుందని మంత్రి వారి కుటుంబానికి భరోసానిచ్చారు. సీఎస్ రంగరాజన్ పై జరిగిన దాడిని మంత్రి సురేఖ తీవ్రంగా ఖండించారు. సంఘవ్యతిరేక శక్తులు తమ స్వప్రయోజనాల కోసం రాముని పేరుతో రాజకీయాలు చేస్తూ, ప్రశాంతంగా సాగుతున్న తెలంగాణ సమాజాన్ని అశాంతికి గురిచేసే చర్యలను ఉక్కుపాదంతో అణచివేస్తామని తేల్చి చెప్పారు. ఎంతో ప్రాచీనమైన హిందూ ధర్మంలో ఎవరి నమ్మకాలు వారివని, తమ నమ్మకాలను ఇతరుల పై రుద్దడం వారి స్వేచ్ఛను హరించడమేనని మంత్రి అన్నారు. తన జీవిత పర్యంతం ధర్మానికే కట్టుబడి జీవించిన శ్రీరాముని పేరుతో హింసకు పాల్పడటం విచారకరమని అన్నారు. ఈ దాడికి కారకులైన వారిని చట్టబద్ధంగా శిక్షిస్తామని తేల్చి చెప్పారు. భవిష్యత్ లో ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని మంత్రి సురేఖ హెచ్చరించారు.

# శవ పరీక్షల కేంద్ర నిర్వహణ పటిష్టంగా జరగాలి



**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మహా:** వరంగల్ నగరంలోని ఎంజీఎం ఆసుపత్రిలో శవ పరీక్షల కేంద్ర నిర్వహణ పటిష్టంగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో సంబంధిత అధికారులతో శవ పరీక్షల కేంద్ర నిర్వహణపై జరిగిన సమావేశంలో కలెక్టర్ సమీక్షించి ఎటువంటి అవినీతి, అవకతవకలకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శవాల పోస్టుమార్టం సకాలంలో జరిగి గౌరవంగా పంపేలా ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మెడికల్, ఫోరెన్సిక్, మున్సిపల్, పోలీస్ అధికారులు సమన్వయంతో పోస్టుమార్టం త్వరతంగా నిర్వహించాలన్నారు. మార్చురీకు వెంటనే మంచినీటి పైప్ లైన్ వేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మార్చురీలో సీసీ కెమెరా ఆడియో రికార్డింగ్ తో సహా ఏర్పాటు చేయాలని, తక్షణమే ఆటోమాల్ లో జనరేటర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎంజీఎం సూపరింటెండెంట్ ను ఆదేశించారు. అనాథ శవాలను న్యాయబద్ధంగా 72 గంటల్లో పంచనామా చేసి ఖననం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. తగినంత సెక్యూరిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారిని ఆదేశించారు. శవాలను కప్పుటకు అవసరమైన తెల్ల వస్త్రాన్ని, బాక్సులు తదితరవి సమకూర్చాలని ఆదేశించారు. నిర్వహణ సక్రమంగా జరిగే విధంగా అధికారులు ఆకస్మికంగా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంజీఎం పర్యవేక్షకులు డాక్టర్ కిషోర్, ఆర్ఎంఓ శ్రీనివాస్, ఫోరెన్సిక్ ప్రొఫెసర్ లక్ష్మణరావు, ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, ఎస్ఐ సాంబయ్య, డి ఈ రంగారావు,తహసిల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# అమరులైన జవాన్లకు కన్నీటి వీడ్కోలు



**మహా,ఛత్తీస్ ఘడ్, మహా :** ఛత్తీస్ ఘడ్ లో ఆదివారం ఇంద్రావతి నేషనల్ పార్కు అటవీప్రాంతంలో మావోయిస్టులకు , భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పులలో అమరులైన జవాన్లకు ఛత్తీస్ ఘడ్ పోలీసులు, భద్రతా బలగాలు ఘనంగా నివాళులర్పించారు.బస్తర్ ఐజి పి.సుందర్ రాజ్ తో పాటు ఛత్తీస్ ఘడ్ పోలీస్ ఉన్నతాధికారులు, భద్రతా బలగాలు జవాన్ల మృతదేహాలకు జాతీయ జెండాను ఉంచి అమర్ రహే అంటూ కన్నీటి వీడ్కోలు పలికారు.ఈ ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతి చెందిన సంగతి తెలిసిందే.

# మహా పత్రిక ఎఫెక్ట్

**మ్యాన్ హోల్ కథనంపై స్పందించిన బల్దియా అధికారులు**



**వరంగల్, మహా:** వరంగల్ 28వ డివిజన్ లోని వరంగల్ చౌరస్తా డాల్ఫిన్ గల్లీకి ఎదురుగా ఉన్న బందిలి శెట్టి వీధి మెయిన్ రోడ్డు పక్కన మ్యాన్ హోల్ పై రక్షణ ఇనుప కవచం (మూత) లేకుండా మ్యాన్ హోల్ ఓపెన్ చేసి ప్రమాదకరంగా ఉందని ప్రజల విజ్ఞప్తి మేరకు మహా పత్రికలో సోమవారం వచ్చిన కథనంపై ఎట్టకేలకు బల్దియా అధికారులు స్పందించారు. బల్దియా అధికారుల ఆదేశాల ప్రకారం స్థానిక కార్పొరేటర్ సూచనల మేరకు సోమవారం ఎట్టకేలకు మ్యాన్ హోల్ పై ఇనుప కవచాన్ని (మూత) వేయడం జరిగింది. ఇందుకు స్థానికులు స్థానిక కార్పొరేటర్ కు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా 28 డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇంకా సుమారు అది మ్యాన్ హోల్ ల పై రక్షణ కవచాలు లేవని స్థానికులు చెబుతున్నారు. వీటిపై కూడా రక్షణ కవచాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆహార భద్రత నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి



**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మహా:** వరంగల్ జిల్లాలో ఆహార భద్రత నిబంధనలను పకడ్బందీగా అమలుచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం కలెక్టరేట్లో ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులపై పరీక్షలు నిర్వహించడం, అలాగే వ్యాపారాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం, ఆహార పదార్థాలతో వ్యాపారాలు చేసేవారు నిబంధనలకు లోబడి ఆహార భద్రత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఆహార పదార్థాల తయారీ, విక్రయ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. ఆహార భద్రత ప్రమాణాలకు అనుగుణంగా లేని వ్యాపారాలకు లైసెన్సులు రద్దు చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు ఆహార భదత నిబంధనల గురించి ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందించే ఆహారం పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైనది తయారు చేసి విద్యార్థులకు అందించాలని, తప్పనిసరిగా ఉపాధ్యాయులు భోజనం చేసి ఆహార నాణ్యతను పరీక్షించాలని చెప్పారు. అంగన్వాడీల్లో, అందించే పౌష్టికాహారం, పాలు, గుడ్లు తదితరవి, ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్నభోజనం నాణ్యతగా ఉండాలని సూచించారు జిల్లాలో ఆహార వ్యాపారం చేసే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఆహార భద్రత ప్రమాణాలను పాటిస్తున్నారో లేదో తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, డిఎస్ డిఓ కిష్టయ్య, జిల్లా పరిశ్రమల అధికారి సాలమాన్ రాజు, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి తదితరులు పాల్గొన్నారు.



ANN తెలుగు
# మహా పత్రిక
07
మంగళవారం, హైదరాబాద్ | 11-02-2025 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM

## భారత్‌లో ప్రపంచంలోనే అతి పొడవైన, శక్తివంతమైన హైడ్రోజన్ రైలు



ప్రపంచంలోనే అత్యంత పొడవైన, శక్తివంతమైన హైడ్రోజన్ రైలును ప్రారంభించేందుకు భారత రైల్వేలు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ రైళ్లను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారు చేస్తున్నారు. త్వరలో ట్రయల్ ఆపరేషన్‌లో ఉంచనున్నారు. కేంద్ర రైల్వే మంత్రి డా. అశ్విని వైష్ణవ్ వారాంతంలో రాజ్యసభకు లిఖితపూర్వకంగా దీని గురించి సమాచారాన్ని పంచుకున్నారు. హైడ్రోజన్ రైలు పూర్తిగా కాలుష్య రహిత రవాణా వాహనం. ఈ రైలు ఇంజిన్‌ను భారత రైల్వేల పరిశోధన రూపకల్పన, ప్రమాణాల సంస్థ (RDSO) పూర్తిగా దేశీయంగా నిర్మించింది. భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ రైలును జింద్, సోనెపట్ సెక్షన్‌లోని 89 కి.మీ మార్గంలో పరీక్షించనున్నారు. జర్మనీ, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్ తర్వాత హైడ్రోజన్ రైలును అభివృద్ధి చేసిన ఏకైక దేశం భారతదేశం. అయితే, పైన పేర్కొన్న దేశాలలోని హైడ్రోజన్ రైళ్లు 500 నుండి 600 హార్స్‌పవర్ (HP) సామర్థ్యాన్ని మాత్రమే కలిగి ఉంటాయి. భారతదేశ హైడ్రోజన్ రైలు సామర్థ్యం 1,200 HP. ఇది ప్రపంచంలోనే అతి పొడవైన హైడ్రోజన్ రైలు అని చెబుతారు.

**హైడ్రోజన్ రైళ్లు ఎలా పని చేస్తాయి?**

హైడ్రోజన్ రైళ్లలో ఇంధన కణాలు అమర్చబడి ఉంటాయి. ఇక్కడ, హైడ్రోజన్, ఆక్సిజన్ రెండూ కలిసినప్పుడు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్తు మోటారుకు శక్తినిచ్చి రైలును కదిలిస్తుంది. ఈ ప్రక్రియలో కాలుష్యం బయటకు రాదు. నీరు ఒక ఉప ఉత్పత్తి. డీజిల్‌తో నడిచే రైలుతో పోలిస్తే దీని శబ్ద కాలుష్యం కూడా తక్కువ. అందువలన హైడ్రోజన్ రైలు దృష్టిని ఆకర్షిస్తుంది. ఇంధనం నింపడానికి ఎక్కువ సమయం పట్టదు.



### బ్యాంకుల్లో మూలుగుతున్న రూ.78 వేల కోట్ల

# అన్ క్లెయిమ్డ్ మనీ..

## ఇంతకీ ఎవరి సొమ్ము..?

దేశంలోని వివిధ బ్యాంకుల వద్ద వేల కోట్ల రూపాయలు నిరుపయోగంగా ఉంది. అంటే ఈ డబ్బుకు హక్కుదారుడు లేడు. దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో అత్యధికంగా క్లెయిమ్ చేయని డబ్బు నిల్వలు పేరుకుపోయాయి. దీంతో తాజాగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ఈ విషయంలో ఒక ప్రచారాన్ని ప్రారంభిస్తోంది, తద్వారా ఖాతాదారులను గుర్తించి, క్లెయిమ్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. భారత ప్రజలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక బంపర్ ఆఫర్ ఇచ్చింది. ఎవరు తీసుకుని చేయని ఒకవేళ కోట్ల డబ్బును క్లెయిమ్ చేసుకోమంటూ పిలుపునిచ్చింది. భారత పౌరులు ఈ డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుంది. అసలు ఏంటి ఈ అన్ క్లెయిమ్డ్ మనీ చాలామంది ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి ఆది క్లెయిమ్ చేయకుండానే చనిపోతారు. కుటుంబ సభ్యులకు కూడా ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్ల విషయం కొన్నిసార్లు తెలియకుండా ఉంటుంది. ఇక కొంతమంది రకరకాలుగా బ్యాంకుల్లో స్కీముల రూపంలో డబ్బులు కట్టి మధ్యలో వదిలేస్తారు. ఇంకా కొంతమంది బ్యాంక్ అకౌంట్లు క్లోజ్ చేయకుండా అలాగే వదిలేస్తారు. కానీ అందులో ఎంతో కొంత నగదు ఉండి ఉంటుంది. ఉద్యోగాలు చేసేవారైతే కంపెనీ మారినప్పుడల్లా కొత్త బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాల్సి ఉంటుంది. పాత బ్యాంక్ అకౌంట్ కి ఎంతో కొంత డిపాజిట్ చెల్లించి ఉంటారు. కానీ సరైన పద్ధతిలో బ్యాంక్ అకౌంట్ క్లోజ్ చేయని కారణంగా ఆ డిపాజిట్ అక్కడే ఉండిపోతుంది. ఇంకొంతమంది బ్యాంకులో లాకర్లు తీసుకొని దానికి ఫిక్స్ డిపాజిట్ చేసి అలాగే మర్చిపోతారు. ఇలా చాలా రకాలుగా ప్రజల డబ్బు బ్యాంకుల్లో 78 వేల కోట్ల రూపాయలు ఉండిపోయాయి. తాజాగా ఈ సొమ్మునంత లెక్కకట్టిన రిజర్వ్ బ్యాంక్ ఆ డబ్బుకు సంబంధించిన యజమానుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. వివిధ బ్యాంకుల్లో జమ చేసిన ఈ అన్‌క్లెయిమ్ చేయని మొత్తం సంవత్సరం తర్వాత సంవత్సరం పెరుగుతోంది. 2021 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య రూ.39,264 కోట్లు ఉంటే 2022 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.48,262 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం ఇది కాస్తా 78 వేల కోట్ల రూపాయలు చేరింది. తన ప్రచారం కింద, బ్యాంకుల్లో గరిష్ట మొత్తంలో డబ్బు జమ అయ్యే ఎనిమిది రాష్ట్రాలపై రిజర్వ్ బ్యాంక్ ఫోకస్ పెట్టింది. కేంద్ర బ్యాంకు వార్షిక నివేదిక ప్రకారం, క్లెయిమ్ చేయని డబ్బులో ఎక్కువ భాగం తెలంగాణ తోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, గుజరాత్, మహారాష్ట్ర, బెంగాల్, కర్ణాటక, బీహార్‌లోని బ్యాంకుల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే క్లెయిమ్ చేయని డిపాజిట్లకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక మార్గదర్శకాలు జారీ చేసింది.

### ఇశ్రామ్ కార్డ్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలా?

# వెరీ సింపుల్!

గిగ్ వర్కర్లలో షాప్ హెల్పర్లు, ఆటో డ్రైవర్లు, డ్రైవర్లు, పంక్చర్ రిపేర్లు, గొర్రెల కాపరులు, పాల యజమానులు, పశువుల పెంపకందారులు, పేపర్ హాకర్లు, జొమాటో, స్విగ్గీ, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి వాటి డెలివరీ బాయ్‌లు ఉన్నారు. గిగ్ వర్కర్లు అంటే తాత్కాలిక ఉద్యోగాలు చేసేవారు, మంచి అవకాశాలు వచ్చినప్పుడు తమ ఉద్యోగాన్ని మార్చుకునే వ్యక్తులు. ఉదాహరణకు స్విగ్గీ, జొమాటో, ఉబర్ వంటి యాప్‌లలో పనిచేసే వ్యక్తులు గిగ్ వర్కర్లు. ఈ ప్రజలందరూ ఇప్పుడు ఇశ్రమ్ కార్డును తయారు చేసుకోవచ్చు. అదే సమయంలో బడ్జెట్ ప్రసంగంలో ఇశ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ ప్రకటించిన తర్వాత ఇప్పుడు పెద్ద ప్రశ్న ఏమిటంటే కార్మికులు ఎలా నమోదు చేసుకోవాలి? ఇశ్రామ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌ను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగా చేయవచ్చు. గిగ్ కార్మికులు eShram పోర్టల్ https://eshram.gov.in/ ని సందర్శించడం ద్వారా తమను తాము నమోదు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ తర్వాత వారికి కార్డు కూడా అందిస్తారు.

**ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేసుకోవాలో తెలుసుకోండి...**

eShram పోర్టల్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం మీరు ముందుగా eshram.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి. అప్పుడు మీరు "eShram లో రిజిస్టర్ చేసుకునే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. తర్వాత మీ ఆధార్ లింక్డ్ మొబైల్ నంబర్, క్యాప్చా కోడ్‌ను నమోదు చేయండి. దీని తర్వాత మీరు EPFO లేదా ESIC సభ్యుడా అనే ప్రశ్న అడుగుతారు, దానికి సమాధానం ఇవ్వండి. ఇప్పుడు "Send OTP" పై క్లిక్ చేసి మీ మొబైల్‌కు వచ్చిన OTPని నమోదు చేయండి. తరువాత మీ 14 అంకెల ఆధార్ నంబర్‌ను నమోదు చేసి నిబంధనలు, షరతులపై టిక్ చేయండి. ఇప్పుడు "సమర్పించు" అనే ఆప్షన్‌పై క్లిక్ చేయండి. ఒక కొత్త ఫారమ్ తెరవబడుతుంది. అందులో మీ పుట్టిన తేదీ, చిరునామా, విద్య మరియు బ్యాంక్ వివరాలను పూరించండి. అన్ని సమాచారాన్ని జాగ్రత్తగా తనిఖీ చేసి, సమ్మతి అనే ఆప్షన్‌పై టిక్ చేసి మళ్ళీ సమర్పించండి. ఈ విధంగా మీ రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. మీరు దీన్ని డౌన్‌లోడ్ చేసుకుని ప్రింటవుట్ కూడా తీసుకోవచ్చు.

## శాంసంగ్ బెస్ట్ సెల్లింగ్ స్మార్ట్ ఫోన్‌పై రూ.8000 డిస్కౌంట్!

2024లో శామ్‌సంగ్ బెస్ట్ సెల్లింగ్ స్మార్ట్‌ఫోన్ Samsung Galaxy A14 5G, ఇప్పుడు దానిని తక్కువ ధరకే కొనుగోలు చేయవచ్చు. ఇటీవలి నివేదిక ప్రకారం, ఈ Samsung ఫోన్ ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడైన 10 స్మార్ట్‌ఫోన్‌ల జాబితాలో ఉంది. ఈ Samsung ఫోన్ గత సంవత్సరం విడుదలైంది. ఈ-కామర్స్ వెబ్‌సైట్ ఫ్లిప్‌కార్ట్‌లో ఈ ఫోన్ ధర రూ.8,000 తగ్గింపు ఉంది. ఇది కాకుండా ఈ Samsung ఫోన్ కొనుగోలుపై డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ ఆఫర్ కూడా అందిస్తోంది. శామ్సంగ్ నుండి వచ్చిన ఈ చౌకైన ఫోన్ శక్తివంతమైన బ్యాటరీ, ఆకర్షణీయమైన ఫీచర్లతో వస్తుంది.

**Samsung Galaxy A14 5G ధర ఎంత?:**

ఈ Samsung స్మార్ట్‌ఫోన్ 8GB RAM+128GB స్టోరేజ్ వేరియంట్ ఈ-కామర్స్ వెబ్‌సైట్ Flipkartలో రూ.12,999కి లభిస్తుంది. ఈ స్మార్ట్‌ఫోన్ గత సంవత్సరం రూ.20,999కి లాంచ్ అయింది. Samsung Galaxy A14 ధర రూ. 8,000. తగ్గించారు. ఇది కాకుండా, ఫ్లిప్‌కార్ట్‌లో ఈ ఫోన్ కొనుగోలుపై 5 శాతం తగ్గింపు కూడా అందించబడుతోంది. అదనంగా ఈ-కామర్స్ కంపెనీ తన కొనుగోళ్లపై ఎక్స్ఛేంజ్ ఆఫర్‌ను కూడా అందిస్తోంది. ఈ స్మార్ట్‌ఫోన్ మూడు రంగులలో వస్తుంది. ముదురు ఎరుపు, లేత ఆకుపచ్చ, నలుపు.

**Samsung Galaxy A14 5G ఫీచర్లు:**

ఈ Samsung బడ్జెట్ ఫోన్ 6.6-అంగుళాల HD+ LCD డిస్ప్లేను కలిగి ఉంది. ఫోన్ డిస్ప్లే వాటర్ నాచ్ డిజైన్‌ను కలిగి ఉంది. ఇది ఆక్టా-కోర్ ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. 8GB RAM + 128GB ఇంటర్నల్ స్టోరేజ్‌తో జత వస్తుంది. దీనిని మైక్రో SD కార్డ్ ద్వారా కూడా స్టోరేజ్‌ని విస్తరించవచ్చు. ఈ Samsung ఫోన్ శక్తివంతమైన 5,000mAh బ్యాటరీని కలిగి ఉంది. Samsung Galaxy A14 USB టైప్ C ఛార్జింగ్‌ను కలిగి ఉంటుంది. ఈ 5G స్మార్ట్‌ఫోన్ వెనుక భాగంలో ట్రిపుల్ కెమెరా సెటప్ అందుబాటులో ఉంది. ఇది 50MP ప్రధాన OIS కెమెరాతో అమర్చబడి ఉంది. ఇది కాకుండా ఫోన్‌లో 2MP మాక్రో, 2MP డెప్త్ సెన్సార్ ఉన్నాయి. ఈ ఫోన్‌లో సెల్ఫీలు, వీడియో కాలింగ్ కోసం 13MP కెమెరా ఉంటుంది. ఆండ్రాయిడ్ 14 ఆధారంగా OneUI 6 పై నడుస్తుంది.




## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



### మహిళల అరెస్ట్‌పై మద్రాస్ హైకోర్టు

# సంచలన తీర్పు..!



సూర్యాస్తమయం తర్వాత, సూర్యోదయానికి ముందు మహిళలను అరెస్టు చేయడంపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మహిళల అరెస్టు నిబంధనలను మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. రాత్రి సమయంలో మహిళలను అరెస్టు చేయకూడదనే నియమం కేవలం మార్గదర్శకం మాత్రమేనని, అది తప్పనిసరి కాదని హైకోర్టు పేర్కొంది. పోలీసులు కోరుకుంటే ఈ నియమాన్ని ఉల్లంఘించవచ్చని హైకోర్టు తెలిపింది. ఈ నిబంధన వెనుక మంచి కారణం ఉందని జస్టిస్ జి ఆర్ స్వామినాథన్, జస్టిస్ ఎం జోతిరామన్ లతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. అరెస్టు చేసే అధికారులకు ఇది ఒక హెచ్చరిక అన్నారు. పోలీసులు ఈ నియమాన్ని పాటించకపోతే, అరెస్టు చట్టవిరుద్ధం కాదన్నారు. కానీ ఆ అధికారి ఆ నియమాన్ని ఎందుకు పాటించలేకపోయాడో కారణాలను చెప్పాల్సి ఉంటుందన్నారు. నియమంలో రెండు విషయాలు చెప్పారు. మొదటిది, ప్రత్యేక సందర్భాలలో తప్ప, సూర్యాస్తమయం నుండి సూర్యోదయం వరకు మహిళలను అరెస్టు చేయకూడదని ధర్మాసనం పేర్కొంది. రెండవది, ప్రత్యేక సందర్భాలలో కూడా, ముందుగా స్థానిక మేజిస్ట్రేట్ నుండి అనుమతి తీసుకోవాలి. నిర్దిష్ట కేసు ఏమిటో నియమం పేర్కొనలేదు. సల్మా వర్సెస్ స్టేట్ కేసులో, కోర్టు న్యాయమూర్తి మహిళల అరెస్టుకు మార్గదర్శకాలను రూపొందించారని హైకోర్టు పేర్కొంది.

ధర్మాసనం న్యాయమూర్తులు, ఈ మార్గదర్శకాలు నియమాల భాషను పునరుద్ఘాటిస్తున్నాయని అని అన్నారు. ఇవి పోలీసుల సమస్యలకు పరిష్కారం చూపవన్నారు. మరిన్ని మార్గదర్శకాలను జారీ చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఈ మార్గదర్శకాలు ప్రత్యేక కేసులు ఏమిటో స్పష్టంగా పేర్కొనాలి. అవసరమైతే BNS సెక్షన్ 43కి కూడా మార్పులు చేయవచ్చని ఈ మేరకు భారత లా కమిషన్ తన 154వ నివేదికలో సూచించినట్లు పేర్కొన్నారు. సూర్యాస్తమయం తర్వాత ఒక మహిళను అరెస్టు చేసినందుకు పోలీస్ ఇన్‌స్పెక్టర్ అనిత, హెడ్ కానిస్టేబుల్ కృష్ణవేణిపై చర్య తీసుకోవాలనే ఉత్తర్వును కోర్టు రద్దు చేసింది. కానీ సబ్‌ఇన్‌స్పెక్టర్ దీపపై ఉన్న ఉత్తర్వును రద్దు చేయడానికి కోర్టు నిరాకరించింది. కోర్టు ముందు తప్పుడు సమాచారం ఇచ్చారని దీపపై ఆరోపణలు వచ్చాయి. ఒక మహిళా నేరస్థురాలిని రాత్రిపూట పట్టుకోవాల్సి వస్తే, పోలీసులు ఏం చేస్తారు? ఒక ఆడ దొంగ రాత్రిపూట మాత్రమే దొంగతనం చేస్తుందనుకుందాం. పోలీసులు ఆమె కోసం ఉదయం వరకు వేచి ఉంటారా? అలాంటప్పుడు, ఆమె పారిపోతుంది! అందువల్ల ఈ నియమం కేవలం మార్గదర్శకం మాత్రమే అని కోర్టు పేర్కొంది. ప్రతిసారీ దీన్ని అనుసరించాల్సిన అవసరం లేదన్నారు. కానీ పోలీసులు దీనిని తప్పుగా ఉపయోగించుకోకూడదని ధర్మాసనం పేర్కొంది. ఎటువంటి కారణం లేకుండా ఏ స్త్రీని రాత్రిపూట అరెస్టు చేయకూడదన్న కోర్టు, పోలీసులు స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించాలన్నారు. తద్వారా పోలీసులు ఎప్పుడు నిబంధనలను ఉల్లంఘించవచ్చో, ఎప్పుడు ఉల్లంఘించకూడదో తెలుస్తుందన్నారు. మహిళల భద్రతకు, పోలీసుల బాధ్యతకు మధ్య సమతుల్యతను సాధించే ప్రయత్నం ఈ నిర్ణయం. తర్వాత ఏమి జరుగుతుందో, పోలీసు శాఖ కొత్త మార్గదర్శకాలను ఎలా రూపొందిస్తారో వేచి చూడాల్సిందే..!

## సనాతన సంప్రదాయాన్ని పరిరక్షించడంలో వనవాసి సమాజం కీలక పాత్ర పోషిస్తుంది: దత్తాత్రేయ జీ

సనాతన హిందూ సంప్రదాయాన్ని పరిరక్షించడంలో వనవాసి సమాజం కీలక పాత్ర పోషించింది. ఈ జ్ఞానం, సంస్కృతి సంప్రదాయాన్ని ప్రోత్సహించడానికి, గిరిజన ప్రాంతాల సాధువులు మరిన్ని ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్కార్యవాహ (ప్రధాన కార్యదర్శి) దత్తాత్రేయ హోసబాలే ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్‌లో ఆల్ ఇండియా వనవాసి కళ్యాణ్ ఆశ్రమం నిర్వహించిన వనవాసి సమాజ సాధువుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే జీ ముఖ్య మార్గదర్శిగా పాల్గొన్నారు. వనవాసి సాధువుల సమావేశంలో, కళ్యాణ్ ఆశ్రమ జాతీయ అధ్యక్షుడు సత్యేంద్ర సింగ్ జీ, గంగాధర్ జీ మహారాజ్, దాదు దయాళ్ జీ పాల్గొన్నారు. వనవాసి కళ్యాణ్ ఆశ్రమం ఫిబ్రవరి 6 నుండి 10 వరకు ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్‌లో ఒక గొప్ప సాధువుల సమావేశం నిర్వహించింది. ఈ చారిత్రాత్మక సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 25 వేల మంది వనవాసి సాధువులు హిందూ మతం, సంస్కృతి, సంప్రదాయాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. దేశవ్యాప్తంగా 12 కోట్ల



గిరిజన సమాజం మతంసంస్కృతిసంప్రదాయాలను కాపాడటంతో పాటు, అఖిల భారత అటవీ సంక్షేమ ఆశ్రమం గిరిజన రంగంలో వివిధ సేవా కార్యకలాపాలను నిర్వహించింది. గత కొన్ని సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా జరిగే వివిధ కుంభమేళా ఉత్సవాల్లో గిరిజన సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకురావడానికి కళ్యాణ్ ఆశ్రమం నిరంతరం ప్రయత్నిస్తోంది. నాసిక్, ఉజ్జయిని, ప్రయాగ్‌రాజ్ వంటి కుంభమేళాలలో గిరిజన సమాజం పెద్ద సంఖ్యలో పాల్గొంటోంది. ఈ సందర్భంగా దత్తాత్రేయ జీ మాట్లాడుతూ.. నేడు హిందూత్వం, భారతీయ, సనాతన సంప్రదాయాలు విదేశీ భావజాలం రుద్దడం, మతమార్పిడి సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఈ ఇబ్బందులను ఎదుర్కొంటూ, గిరిజన సాధువులు మారుమూల అటవీ ప్రాంతాలలో అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. వారి కృషి వల్లనే నేడు హిందూ మతం సజీవంగా ఉంది. రాబోయే కాలంలో, పర్యావరణం, పరిశోధన, విద్య, సంస్కృతి, మతపరమైన మేల్కొలుపు, సేవ ద్వారా గిరిజన సమాజంలో అవగాహన కల్పించడం ద్వారా మన సమాజ ఐక్యత, ఉనికిని కాపాడుకోవడానికి మరిన్ని ప్రయత్నాలు అవసరమని దత్తాత్రేయ జీ అన్నారు. కళ్యాణ్ ఆశ్రమం ఈ దిశలో పనిచేస్తోంది. అందుకే శ్రీ హోసబాలే చివరకు గిరిజన ప్రాంతంలోని అన్ని సాధువులు, ఋషులు కళ్యాణ్ ఆశ్రమానికి మద్దతు ఇవ్వడం ద్వారా ఈ శాశ్వత సంస్కృతిని బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి 77 గిరిజన వర్గాలకు చెందిన 25వేల మంది సాదువులు, మహంతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సాధువులలో కొందరు గిరిజన ప్రాంతాలలో పనిచేసేటప్పుడు ఎదుర్కొన్న సవాళ్లు, పరిస్థితుల గురించి తమ అనుభవాలను పంచుకున్నారు. కళ్యాణ్ ఆశ్రమ జాతీయ అధ్యక్షుడు సత్యేంద్ర సింగ్ జీ, సెయింట్ కాంగ్రిగేషన్ పరిచయం చేశారు. దేశంలోని గిరిజన ప్రాంతాలలో వారి గిరిజన సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి వివిధ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రయత్నాలను అడ్డుకోవడానికి, సాదువులు, ఋషులు ముందుకు వచ్చి ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని శ్రీ సత్యేంద్ర సింగ్ జీ అన్నారు. ఇదిలావుండగా, ఈ సమావేశానికి హాజరైన దత్తాత్రేయ హోసబాలే జీని ఘనంగా సత్కరించారు. సాదువులు, ఋషులందరినీ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ కుంభమేళా కమిటీ బహుమతులు ఇచ్చి సన్మానించింది.

## రూ.36 లక్షలు చెల్లించి మరణం కొని తెచ్చుకున్న పంజాబీ యువకుడు..!

స్వదేశంలో అపారమైన అవకాశాలున్నా సరే యువతలో అగ్రరాజ్యంపై క్రేజ్ పెరుగుతోంది. డాలర్ కలలు.. అక్కడ చదివితేనే భవిత అదే. భూతల స్వర్గమనే భ్రమలో.. ఎన్నో తిప్పలు పడి, అప్పులు చేసి మరి పిల్లలను అమెరికా పంపిస్తున్నారు తల్లిదండ్రులు. సక్రమ మార్గమా..? అక్రమ మార్గమా చూడకుండా అమెరికాలో అడుగు పెట్టడమే లక్ష్యంగా యువత పరుగులు పెడుతోంది. ఈ క్రమంలోనే అమెరికా వెళ్లే ప్రయత్నంలో పంజాబ్‌కు చెందిన మరో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ యువకుడు అమెరికాకు చట్టవిరుద్ధంగా డాంకీ రూట్ ద్వారా చేరుకోవడానికి ప్రయత్నించిన చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాలోని రామ్‌దాస్ పట్టణానికి చెందిన 33 ఏళ్ల గురుప్రీత్ సింగ్ గ్వాటెమాల సమీపంలో గుండెపోటుతో అక్కడికక్కడే మరణించాడు. అతను ఆరుగురు సోదరీమణులకు ఏకైక సోదరుడు. అతనితో పాటు ప్రయాణిస్తున్న ఒక యువకుడు ఈ సంఘటన గురించి ఫోన్ ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. దీంతో ఆ కుటుంబం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది. గురుప్రీత్ సింగ్ మూడు నెలల క్రితం ఒక ఏజెంట్‌ను సంప్రదించి, అమెరికాకు వెళ్లేందుకు రూ.36 లక్షలకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. ఆ ఏజెంట్ అతన్ని డాంకీ రూట్ ద్వారా అమెరికాకు తీసుకెళ్తానని వాగ్దానం చేశాడు. గురుప్రీత్



విదేశాల్లో పని చేయడం ద్వారా తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని కోరుకున్నాడని అతని కుటుంబం చెబుతోంది. తన ప్రయాణంలో, అతను గ్వాటెమాల చేరుకున్నప్పుడు, అతనికి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. అక్కడ ఉన్న ఇతర ప్రయాణీకులు అతన్ని కాపాడటానికి ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. అతనితో పాటు ప్రయాణిస్తున్న ఒక యువకుడు అమృత్‌సర్‌లోని యువకుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఈ విచారకరమైన వార్త చెప్పాడు. గురుప్రీత్ సింగ్ గతంలో విదేశాల్లో నివసించాడు. ఆరు సంవత్సరాల క్రితం అతను వర్క్ పర్మిట్‌తో యునైటెడ్ కింగ్‌డమ్ (UK) వెళ్ళాడు. అతను కొన్ని సంవత్సరాలు పంజాబ్‌లో పనిచేసిన తర్వాత ఇటీవలే అమెరికాకు వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాడు. తన సోదరీమణుల వివాహాల కోసం ఎక్కువ డబ్బు సంపాదించాలని అమెరికా వెళ్లాలని గురుప్రీత్ నిర్ణయించుకున్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. గురుప్రీత్ కుటుంబం ప్రకారం, అతని ఆర్థిక పరిస్థితి బాగా లేదు. అతను కుటుంబానికి ఏకైక ఆధారం. ఇప్పుడు అతని మరణంతో ఆ కుటుంబం పూర్తిగా ఛిన్నాభిన్నమైంది. మరోవైపు, గురుప్రీత్ మృతదేహాన్ని భారతదేశానికి తీసుకురావడానికి సహాయం చేయాలని, తద్వారా ఆయన అంత్యక్రియలు నిర్వహించవచ్చని కుటుంబ సభ్యులు కేంద్ర ప్రభుత్వానికి, పంజాబ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా, పంజాబ్ నుండి చాలా మంది యువకులు డాంకీ రూట్ ద్వారా అమెరికా, కెనడా, యూరప్ దేశాలకు వెళ్ళడానికి ప్రయత్నిస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు. డాంకీ రూట్ ద్వారా ప్రజలు మొదట దుబాయ్, టర్కీ, బ్రెజిల్, కొలంబియా లేదా మెక్సికో వంటి దేశాలకు చేరుకుంటారు. అక్కడి నుండి వారు అడవులు, ప్రమాదకరమైన మార్గాల ద్వారా అమెరికా సరిహద్దును దాటడానికి ప్రయత్నిస్తారు. గత కొన్ని నెలలుగా, ఈ ప్రాణాంతక ప్రయాణంలో పంజాబ్‌కు చెందిన యువకులు ప్రాణాలు కోల్పోయిన అనేక కేసులు వెలుగులోకి వచ్చాయి. అమెరికా, మెక్సికో సహా ఇతర దేశాల ప్రభుత్వాలు కూడా అక్రమ వలసలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. ఈ కారణంగా ఈ మార్గం ఇప్పుడు మరింత ప్రమాదకరంగా మారింది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. అక్రమ వలసలపై సీరియస్ యాక్షన్ మొదలుపెట్టారు. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద డీపోర్టేషన్ ఆపరేషన్ చేపట్టి అక్రమ వలసదారుల్లో వణుకు పుట్టిస్తున్నారు. ఉపాధి కోసం కొందరు.. శరణార్థులుగా మరికొందరు.. అగ్రరాజ్యంపై మోజుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది అమెరికాలో అక్రమంగా అడుగుపెట్టేందుకు ప్రయత్నిస్తుంటారు. అయితే.. ఇలా అమెరికాలోకి ఎంటర్ అయ్యేందుకు అక్రమ మార్గాలను ఎంచుకుంటారు కొందరు వలసవాదులు. ఈ నేపథ్యంలోనే కఠినంగా వ్యవహరించాలని ట్రంప్ సర్కార్ నిర్ణయించింది.

08

# మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | మంగళవారం, హైదరాబాద్ | 11-02-2025

ANN తెలుగు



## ప్రియుడికి రొమాంటిక్‌గా బర్త్‌డే విషెస్ చెప్పిన పాయల్ రాజ్‌పుత్..

**'ఆర్‌ఎక్స్ 100' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది పాయల్ రాజ్ పుత్. మొదటి సినిమాతోనే అందం, అభినయం పరంగా మంచి మార్కులు తెచ్చుకుంది. మధ్యలో వరుసగా అపజయాలు ఎదుర్కొన్నా, మంగళవారం సినిమాతో మరో బ్లాక్ బస్టర్ హిట్ ను ఖాతాలో వేసుకుంది.**


మంగళవారం సినిమాతో ఎట్టకేలకు సక్సెస్ ట్రాక్ ఎక్కింది పాయల్ రాజ్ పుత్. ఆర్ ఎక్స్ 100 తర్వాత వరుసగా ఫ్లాపులతో డీలా పడిపోయిన ఈ బ్యూటీకి మంగళవారం సినిమా సరికొత్త జోష్ ఇచ్చింది. ఇప్పుడిదే ఉత్సాహంలో వరుసగా సినిమాలకు సైన్ చేస్తోంది అందాల తార. ప్రస్తుతం వెంకటలచ్చిమి అనే పాన్ ఇండియా మూవీలో నటిస్తోంది పాయల్ రాజ్ పుత్. తెలుగుతో పాటు హిందీ, పంజాబీ, కన్నడ, మలయాళం, తమిళం భాషల్లో మొత్తం ఆరు భాషల్లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది పాయల్. తన గ్లామరస్ అండ్ ఫ్యాషనబుల్ ఫొటోలను అందులో షేర్ చేస్తుంటుంది. అలాగే పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ విషయాలను ఫాలోవర్లతో పంచుకుంటుంది. అలా తాజాగా పాయల్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఇందులో ఆమె తన బాయ్‌ఫ్రెండ్ సౌరభ్ ధింగ్రా పుట్టినరోజు కావడంతో రొమాంటిక్‌గా విషెస్ చేసింది. వివిధ సందర్భాల్లో అతనితో కలిసి దిగిన ఫొటోలను షేర్ చేస్తూ బర్త్ డే శుభాకాంక్షలు తెలిపింది. 'నన్ను అర్థం చేసుకునే వ్యక్తికి పుట్టిన రోజు శుభాకాంక్షలు. నీ ప్రేమ, జాలి, దయ, మద్దతు నా జీవితంలో నిజమైన దీవెనలు. అన్ని వేళల్లో మీ మార్గదర్శకత్వం, ప్రేమను అందిస్తూ మీరు నా కోసం ఉన్నందుకు చాలా కృతజ్ఞతతో ఉన్నాను. ఈ ప్రత్యేకమైన రోజున ఎల్లప్పుడు ఆనందం, ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నా' అంటూ తన ప్రియుడిపై ప్రేమను కురిపించింది పాయల్. ప్రస్తుతం ఈ బ్యూటీ షేర్ చేసిన పోస్ట్, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరలవుతున్నాయి. వీటిని చూసిన నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. కాగా వెంకటలచ్చిమి సినిమాలో పవర్ ఫుల్ పాత్రలో కనిపించనుంది పాయల్ రాజ్ పుత్. ఇటీవలే హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఈ మూవీ షూటింగ్ ప్రారంభమైంది. పాన్ ఇండియా కాన్సెప్ట్ తో ముని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ట్రైబల్ గర్ల్ యాక్షన్ రివెంజ్ స్టోరీతో కూడిన ఈ రివేంజ్ డ్రామా ఇండియన్ ఇండస్ట్రీలో సంచలనం సృష్టిస్తుందని బల్ల గుద్ది మరీ చెబుతున్నాడు ముని.

## విడుదలై ఏడాది అవుతున్నా ఓటీటీకి నోచుకోని రజినీకాంత్ సినిమా..

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నటించిన వెట్టయన్ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. జ్ఞానవేల్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా తర్వాత ఇప్పుడు కూలీ సినిమా చేస్తున్నారు సూపర్ స్టార్. ఈ సినిమాకు లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎల్సీయూ లో భాగంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అలాగే ఈ సినిమాలో నాగార్జున కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. వెట్టయన్ సినిమాకంటే ముందు లాల్ సలాం అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. రజనీ కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. యంగ్ హీరోలు విష్ణు విశాల్, విక్రాంత్ సంతోష్ ప్రధాన పాత్రలు పోషించారు. అలాగే భారత దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్, జీవితా రాజశేఖర్ తదితరులు ఇతర పాత్రల్లో మెరిశారు. రిలీజ్ కు ముందు ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, టీజర్లు, ట్రైలర్ తో లాల్ సలామ్ సినిమాపై ఆసక్తి పెరిగింది. అయితే గత ఏడాది ఫిబ్రవరి 9న విడుదలైన ఈ మూవీకి మిక్స్‌డ్ టాక్ వచ్చింది. తమిళంతో పాటు తెలుగులోనూ ఒకేసారి రిలీజైన లాల్ సలామ్‌కు పెద్దగా కలెక్షన్లు రాలేదు. ప్రముఖ అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌లో లాల్ సలామ్ సినిమాను రూపొందించగా.. ఏ సుభాస్కరన్ నిర్మాతగా వ్యవహరించారు. ఆస్కార్ అవార్డ్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందించడం విశేషం. ఈ సినిమా విడుదలై ఏడాది అవుతున్నా ఇప్పటికీ ఈ సినిమా ఓటీటీలోకి రాలేదు. ఇక లాల్ సలామ్ స్టోరీ విషయానికి వస్తే.. ఒక గ్రామంలో జరిగే హిందూ, ముస్లిం గొడవలను ఆధారంగా చేసుకుని ఈ మూవీని తెరకెక్కించారు ఐశ్వర్య. ఇందులో మొయిద్దీన్ భాయ్‌గా రజినీకాంత్ అభినయానికి మంచి మార్కులే పడినా సినిమాలోని ఇతర అంశాలు ప్రేక్షకులకు పెద్దగా ఎక్కలేదు. కాగా ఈ సినిమా ఓటీటీలో ఎప్పుడెప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.




## అమాయకపు చూపుతో ఆకట్టుకుంటున్న శ్రీలీల



**యంగ్ బ్యూటీ శ్రీలీల గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పని లేదు. పెళ్లి సందడి మూవీతో ఈ బ్యూటీ వెండితెరకు పరిచయమైంది. ఈ మూవీలో తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. దీంతో ఈ ముద్దుగుమ్మకు వరసగా ఆఫర్స్ క్యూ కట్టడంత, వరస సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది ఈ అమ్మడు. అంతే కాకుండా తెలుగు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టి చాలా తక్కువ రోజుల్లోనే స్టార్ స్టేటస్ అందుకుంది ఈ ముద్దుగుమ్మ.**

శ్రీలీల అతి చిన్న వయసులోనే స్టార్ స్టాండమ్ అందుకొని, స్టార్ హీరోల సరసన నటించే అవకాశం కొట్టేసింది. ముఖ్యంగా ఈ బ్యూటీ ధమాకా సినిమాతో మంచి పాపులారిటీ సొంతం చేసుకుందని చెప్పవచ్చు. ఈ మూవీలో ఈ అమ్మడు గ్లామర్‌కు, డ్యాన్స్‌కు ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. ఇక ఈ మూవీ తర్వాత శ్రీలీలకు సరైన బ్లాక్ బస్టర్ హిట్ రాలేదనే చెప్పవచ్చు. ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన వరస ఫొటోషూట్స్‌తో కుర్రకారు మతి పొగొడుతుంటుంది. తాజాగా ఈ చిన్నది అమాయకపు చూపులతో కుర్రకారును ఆకట్టుకుంది. చాలా సింపుల్‌గా చూడటానికి ఎంతో అందంగా ఉంది ఈ ముద్దుగుమ్మ. విటేజ్ లుక్‌లో చిన్న పిల్లలా, అమాయకపు చూపుతో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఈ క్యూట్ పిక్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

# క్రీడా వార్తలు | SPORTS NEWS



## 3వ వన్డే థీమ్ ఇదే..

### జైషా కీలక వ్యాఖ్యలు

ఫిబ్రవరి 12న అహ్మదాబాద్‌లో భారత్, ఇంగ్లాండ్ మధ్య మూడో వన్డే జరగనుంది. ఈ క్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్ జై షా కీలక ప్రకటన చేశారు. "అవయవ దానం, ప్రాణాలను కాపాడండి" అనే థీమ్‌తో మూడో వన్డేను జరపించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మ్యాచ్ ద్వారా అవయవ దాన అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం క్రికెట్ వేదికను ఉపయోగించి అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు అవయవ దానం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించి, ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రజలంతా ప్రతిజ్ఞ చేసేలా ప్రోత్సహించాలని ఈ మేరకు పిలుపునిచ్చాడు. భారతదేశంలో అవయవ దానం ఒక కీలకమైన వైద్య అవసరంగా మారింది. వేలాది మంది రోగులు ప్రాణాలను రక్షించేందుకు అవయవాల మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు. వైద్య శాస్త్రంలో పురోగతి ఉన్నప్పటికీ, మరణానంతరం అవయవాలను దానం చేయాలనే అవగాహన, సంసిద్ధత తక్కువగానే ఉంది. నరేంద్ర మోడీ స్టేడియంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం, అవయవ దానం ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఈ అంతరాన్ని తగ్గించడానికి ప్రణాళికలు వేస్తోంది. ''ప్రజలను ఏకం చేసే శక్తి క్రీడలకు ఉంది. అందుకు ఫిబ్రవరి 12న అహ్మదాబాద్‌లో జరగబోయే మూడో వన్డే సందర్భంగా 'అవయవాలను దానం చేయండి, ప్రాణాలను కాపాడండి అనే అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించడం మాకు గర్వకారణం. అవయవ దానం విషయంలో ముందడుగు వేయాలని.. ప్రజలను చైతన్యపరచాలని అనుకుంటున్నాం. ప్రపంచంలో ఇతరులకు వారి జీవితాన్నే బహుమతిగా ఇవ్వడం కన్నా మరొకటి ఉండదు'' అని జైషా పేర్కొన్నారు.

### వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్..

**కటక్‌లో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లాండ్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించి, సిరీస్‌ను 2-0తో భారత జట్టు కైవసం చేసుకుంది. భారత కెప్టెన్ రోహిత్ శర్మ అద్భుతమైన సెంచరీతో తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. 305 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ 90 బంతుల్లో 12 బౌండరీలు, 7 సిక్సర్లతో 119 పరుగులు చేసి ఆతిథ్య జట్టును సునాయాస విజయానికి నడిపించాడు. శుభ్‌మాన్ గిల్ 60 పరుగులు చేయగా, అక్షర్ పటేల్ 41* పరుగులు చేసి 33 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది.**



## సెంచరీతో బ్యాక్ టూ ఫాం

### ట్రోఫీకి ముందు దడ పుట్టిస్తోన్న టీమిండియా ప్లేయర్

కటక్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో రోహిత్ శర్మ 119 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. రోహిత్ కేవలం 30 బంతుల్లోనే అర్ధ సెంచరీ, 72 బంతుల్లోనే సెంచరీ సాధించి తన దూకుడు శైలిని ప్రదర్శించాడు. చాలా కాలంగా ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న రోహిత్ ఇన్నింగ్స్, ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత అభిమానులకు చాలా ఉపశమనం కలిగించబోతోంది. రోహిత్ ఫామ్‌లోకి రావడం భారత జట్టుకు చాలా ముఖ్యం. రోహిత్ తన ఇన్నింగ్స్‌లో ఎప్పుడూ ఇబ్బందుల్లో కనిపించలేదు. రోహిత్ ఫామ్‌లోకి రావడం భారత్‌కు చాలా మంచి సంకేతం. రోహిత్ తిరిగి ఫామ్‌లోకి రావడం భారత జట్టుకు బిగ్ రిలీఫ్‌గా మారింది.

**బలమైన ప్రారంభం..**


రోహిత్ దూకుడుగా ఆడే బ్యాట్స్‌మన్. ముఖ్యంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో రోహిత్ తుఫాన్ బ్యాటింగ్‌తో బౌలర్లకు దడ పుట్టిస్తున్నాడు. రోహిత్ వన్డే క్రికెట్‌లో తన ఆడే శైలిని పూర్తిగా మార్చుకున్నాడు. ఇప్పుడు రోహిత్ చాలా వేగంగా పరుగులు సాధిస్తున్నాడు. రోహిత్ ఫామ్‌లో ఉన్నప్పుడు, భారత జట్టు దూకుడుగా ఆడటం ఖాయం. చాలా సార్లు, బ్యాట్స్‌మెన్ మిడిల్ ఓవర్లలో ఈ ప్రారంభం వల్ల ప్రయోజనం పొందుతారు. చాలా వేగంగా ప్రారంభిస్తే, వన్డే క్రికెట్‌లో సులభంగా భారీ స్కోరును చేరుకోవచ్చు.

**ఐసీసీ టోర్నమెంట్‌లో అనుభవజ్ఞుడైన ఆటగాడు..**

ఐసీసీ టోర్నమెంట్లలో రోహిత్ బ్యాట్ ఎల్లప్పుడూ ఫామ్‌లో ఉంటుంది. ఈ 37 ఏళ్ల బ్యాట్స్‌మన్‌కు ఇప్పుడు ఐసీసీ టోర్నమెంట్లలో మంచి అనుభవం ఉంది. 2019 ప్రపంచ కప్‌లో రోహిత్ ఐదు సెంచరీలు సాధించగా, 2023 ప్రపంచ కప్‌లో కూడా అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. రోహిత్ కెరీర్ ఇప్పుడు ముగింపు దశకు చేరుకుంది. ఇటువంటి పరిస్థితిలో, ఛాంపియన్స్ ట్రోఫీ ఎంతో కీలక టోర్నమెంట్ అవుతుంది. మరో ఐసీసీ టోర్నమెంట్‌లో తన బ్యాట్‌తో గొప్పగా రాణించి జట్టును మంచి స్థితికి తీసుకెళ్లడానికి రోహిత్ తన శాయశక్తులా ప్రయత్నిస్తాడు.

### భారీ ఇన్నింగ్స్‌లు ఆడగల సామర్థ్యం..

**రోహిత్‌లో ఉన్న అతి పెద్ద ప్రత్యేకత ఏమిటంటే, అతను పరిమిత ఓవర్ల క్రికెట్‌లో స్థిరపడిన తర్వాత, అతను సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడగలడు. వన్డే క్రికెట్‌లో మూడు డబుల్ సెంచరీలు సాధించడం ద్వారా అతను దీనిని ఒకటి కంటే ఎక్కువసార్లు నిరూపించాడు. రోహిత్ స్థిరపడిన తర్వాత, ప్రత్యర్థి జట్టు అతన్ని అవుట్ చేయడం చాలా కష్టం అవుతుంది. దీనితో పాటు, పరుగుల వేగాన్ని నియంత్రించడం కూడా కష్టం అవుతుంది. రోహిత్ మంచి ఫామ్‌లో ఉంటే, అతను ఎలాంటి బౌలర్లకైనా ఇబ్బంది కలిగించగలడు.**



## భారత్‌పై ఓటమితో ఇంగ్లండ్‌కు బిగ్ షాక్

### ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి తుఫాన్ బ్యాటర్ ఔట్

ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ఇంకా 10 రోజుల కంటే తక్కువ సమయం మాత్రమే ఉంది. అంతకుముందే ఇంగ్లాండ్ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు యువ విధ్వంసక బ్యాట్స్‌మన్ జాకబ్ బెథెల్ గాయం కారణంగా మొత్తం టోర్నమెంట్‌కు దూరమయ్యాడు. జాకబ్ బెథెల్ భారత్‌తో జరిగిన రెండో వన్డే ఆడలేదు. ఆ సమయంలో అతను ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడలేడని దాదాపుగా నిర్ధారించారు. భారత్‌తో జరిగే చివరి వన్డే కోసం బెథెల్ జట్టుకు టామ్ బాంటన్‌ను కవర్ టర్నర్‌గా ఎంపిక చేశారు. ఇటువంటి పరిస్థితిలో, అతను ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా బెథెల్ స్థానంలో వచ్చే అవకాశం ఉంది. భారత్‌తో జరిగిన రెండో వన్డే సందర్భంగా ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ ఇప్పటికే జోస్ బట్లర్ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడటం కష్టమని స్పష్టం చేశాడు. జాకబ్ బెథాల్ ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడలేడని తెలిపాడు. అతను ఈ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు. ఇది ఇంగ్లండ్ జట్టుకు చాలా నిరాశ కలిగించే విషయం. గాయం కారణంగా అతను ఈ టోర్నమెంట్‌కు దూరంగా ఉండటం చాలా సిగ్గుచేటు. ఇంగ్లాండ్ జట్టు ప్రస్తుతం చాలా మంది ఆటగాళ్ల గాయాలతో ఇబ్బంది పడుతోంది. ఆ జట్టు వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ జేమీ స్మిత్ కూడా గాయపడ్డాడు. దీని కారణంగా, కటక్‌లో భారత్‌తో జరిగిన రెండో వన్డే సందర్భంగా, జట్టు అసిస్టెంట్ కోచ్ మార్కస్ ట్రెస్కోథిక్, పాల్ కాలింగ్‌వుడ్‌లను సబ్‌ఫీల్డర్లుగా చేయవలసి వచ్చింది. మరికొంత మంది ఇంగ్లాండ్ ఆటగాళ్లు గాయపడితే ఈ కోచ్‌లు ఫీల్డింగ్ కోసం మైదానంలోకి వెళ్లాల్సి ఉంటుంది. భారత్‌తో జరిగిన తొలి రెండు వన్డేల్లో ఇంగ్లాండ్ ఓడిపోయింది. ఇప్పుడు వారి దృష్టి సిరీస్‌లోని మూడవ మ్యాచ్ గెలవడంపై ఉంది. ఇంగ్లండ్ జట్టు విజయంతో ఛాంపియన్స్ ట్రోఫీలోకి వెళ్లాలని కోరుకుంటోంది. తద్వారా వారి ఆత్మవిశ్వాసం కొంచెం పెరుగుతుంది. ప్రస్తుతానికి ఇంగ్లాండ్ బౌలర్లు అంత బాగా రాణించలేకపోతున్నారు. ముఖ్యంగా భారత పిచ్‌లపై బౌలర్లు చాలా పరుగులు ఇచ్చారు. రెండో వన్డేలో ఆ జట్టు 300 కంటే ఎక్కువ పరుగులు చేసింది. అయినప్పటికీ, ఇంగ్లండ్ జట్టు లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com